
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
శనివారం 23 ఆగస్టు 2025 | 5

నేడు సీఎం చంద్రబాబు రాక

పెద్దాపురం, సామర్లకోటలో పర్యటన





హెలికాప్టర్ ట్రయల్ రన్

సీఎం చంద్రబాబు పర్యటన దృష్ట్యా ముందస్తుగా భద్రతా చర్యల్లో భాగంగా అమరావతి నుంచి సామర్ల కోటకు హెలీకాప్టర్ ట్రయల్ రన్ శుక్రవారం నిర్వ హించారు. సామర్లకోట-పెద్దాపురం రోడ్‌లో హెలీపాడ్ ఏర్పాటుచేశారు. సామర్లకోటలో హెలీకాప్టర్ ల్యాండ్ అయిన తర్వాత మళ్లీ అమరావతికి తరలివెళ్లింది.

సామర్లకోట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం తొలి సారిగా కాకినాడ జిల్లా పెద్దాపురం నియోజక వర్గంలో సీఎం చంద్రబాబు శనివారం రోజంతా పర్యటించనుండడంతో అటు ప్రజాప్రతినిధులే కాదు, జిల్లాఅధికార యంత్రాంగం సైతం ఉరుకులు పరుగులు పెడుతున్నారు. స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉండవిల్లిలోని సీఎం చంద్రబాబు స్వగృహం నుంచి శనివారం ఉదయం 10.10 గంటలకు హెలీకాప్టర్‌లో బయలుదేరతారు. 11.00 గంటలకు పెద్దాపురం రోడ్లో ఏర్పాటుచేసిన హెలీపాడ్‌లో దిగుతారు. 4.40 గంటలకు పర్యటన ముగించుకుని హెలీకాప్టర్‌లో అమరావతికి బయలుదేరతారు. ఈమేరకు 1,045 మందితో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. వీరిలో అడిషనల్ ఎస్పీలు ఐదుగురు, డీఎస్పీలు 14 మంది, సీఐలు 51 మంది, ఎస్ఐలు 91 మంది, ఏఎస్ఐలు, హెచ్‌సీలు 183 మంది, పోలీసులు 467 మంది, మహిళా పోలీసులు 69 మంది, హోంగార్డులు 165 మందితో బందోబస్తు నిర్వహించనున్నట్టు కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు. సామర్లకోట పూర్ణా కల్యాణ మండపంలో శుక్రవారం మధ్యాహ్నం బందోబస్తు సిబ్బందికి తగు ఆదేశాలిచ్చారు. ఆయా వేదికల వద్ద నిఘా విస్తృతం చేశారు. మునుపెన్నడూ లేనివిధంగా భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. పాస్‌లు ఉన్న వారినే లోనికి అనుమతించనున్నారు. ఆయా సంస్థలకు చెందిన పాత్రికేయులు ఒక్కొక్కరిని మాత్రమే అనుమతించేలా చర్యలు తీసుకున్నారు. ఇక విస్తృత బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా పోలీసు అధికారులు పలు వాహనాలను దారి మళ్లిస్తూ ట్రాఫిక్ చర్యలు చేపట్టారు. సామర్లకోట నుంచి పెద్దాపురం వెళ్లే అన్ని భారీ వాహనాలను సామర్లకోట ఏడీబీ రోడ్డు మీదుగా పెద్దాపురంనకు శుక్రవారం సాయంత్రం నుంచే మళ్లిస్తున్నారు. పిఠాపురం, కిర్లంపూడిల మీదుగా సామర్లకోట మాత్రమే వాహనాలను అనుమతిస్తున్నారు. ఆర్టీసీ బస్సులను ఏడీబీ రోడ్డు మీదుగా మళ్లిస్తున్నారు. సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, సామర్లకోట, పెద్దాపురంలలో పర్యటిస్తూ కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ బిందు మాధవ్‌లకు సూచనలిచ్చారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ సమావేశాలను విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు.

లంకలు విలవిల

- ఉగ్రరూపం దాల్చిన గోదావరి
- పొంగి ప్రవహిస్తున్న కోనసీమ నదులు
- ముంపు బారిన పడుతున్న ఉద్యాన పంటలు
- కాజ్‌వేలు నీట మునక.. పడవలపై దాటింపు
- లంక గ్రామాల్లో రాకపోకలకు అష్టకష్టాలు
- వరద పరిస్థితిపై కలెక్టర్, ఎస్పీలతో ఫోన్‌లో మాట్లాడిన ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు
- అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశం





ఆలమూరు మండలం మూలస్థాన అగ్రహారం వద్ద గోదావరి వరదనీటికి కొట్టుకుపోయిన కాజ్‌వే.. పి.గన్నవరం గంటిపెదపూడి ఏటిగట్టు దిగువన కాజ్‌వేపై నుంచి వరదనీటిలో వస్తున్న మహిళలు



మామిడికుదురు మండలం అప్పనపల్లి మొల్లేటివారిమెరకలో ఇళ్ల చుట్టూ చేరిన వరదనీరు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

గోదావరి వరద ఉగ్రరూపం దాల్చింది. కోనసీమలోని నదీపాయలన్నీ ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. నదీ పరివాహక ప్రాంతాల్లోని లంక గ్రామాలను వరదనీరు ముంచెత్తుతోంది. ఫలితంగా ఉద్యాన పంటలు, కొబ్బరితోటలతో పాటు ఇతర చెరకు, అరటి, తమలపాకు, కంద, మొక్కజొన్న వంటి అనేక ఉద్యాన పంటలన్నీ వరద దిగ్బంధనంలో చిక్కుకున్నాయి. జిల్లాలో శుక్రవారం ధవళేశ్వరం బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీచేశారు. బ్యారేజీకి సంబంధించిన 175 గేట్లను ఎత్తి 13.22 లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదలడంతో కోనసీమలోని గౌతమీ, వశిష్ఠ, వైనతేయ, వృద్ధగౌతమి నదీపాయల్లో వరద ప్రవాహం పోటెత్తింది. దీనికితోడు శుక్రవారం అమావాస్య కావడంతో సముద్రం ఎగదన్నడం వల్ల వరదనీరు నెమ్మదిగా సముద్రంలో కలుస్తుండడంతో ముంపు తీవ్రత పెరిగి లంక గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో మూడు ప్రధాన పంట కాల్వల ద్వారా 10800 క్యూసెక్కుల నీటిని సాగునీటి కోసం విడుదల చేశారు. వరద ఉధృతిపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు శుక్రవారం అమలాపురంలోని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, ఎస్పీ బి.కృష్ణారావులతో విశాఖపట్నం నుంచి ఫోన్‌లో మాట్లాడి వరద పరిస్థితిపై సమీక్షించారు. జిల్లాలోని వివిధ వరద ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. వశిష్ఠ నదికి వరద పెరగడంతో చాకలిపాలెం కాజ్‌వే మునిగి దొడ్డిపట్ల రేవులో పడవల రాకపోకలను నిలుపుదల చేశారు. నర్సాపురం, సఖినేటిపల్లి రేవులో కూడా పంటు ప్రయాణాలు నిలుపుదల చేయడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. మామిడికుదురు మండలం అప్పనపల్లి వెళ్లే కాజ్‌వే నీట మునగడంతో బాలబాలాజీ దేవస్థానానికి వెళ్లే భక్తులకు ఇబ్బందికరంగా మారింది. అయినవిల్లి మండలం ఎదురుబిడియం తొగరపాయ పొంగడంతో అయినవిల్లిలంక, వీరవల్లిపాలెం వెళ్లే ప్రజల రాకపోకలకు బ్రేక్ పడింది. ఇక్కడ పడవలు ఏర్పాటుచేసి జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఆలమూరు మండలం మూలస్థానం వద్ద వేసిన కాజ్‌వే వరద నీటికి కొట్టుకు పోవడంతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. నారాయణలంక వద్ద కూడా కాజ్‌వే ముంపునకు గురైంది. ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలోని లంకాఫ్‌ఠాణేలంకతోపాటు వివిధ లంక గ్రామాలకు వరద ప్రవాహం పోటెత్తడంతో ప్రజల రవాణా సౌకర్యాలు స్తంభించిపోయాయి. ముమ్మిడివరం నియోజకవర్గం ప్రాంతంలో జాయింట్ కలెక్టర్ నిషాంతి పర్యటించి వరద పరిస్థితిని అంచానా వేశారు. ఆర్డీవో కె.మాధవి అల్లవరం మండలం బోడసకుర్రులోని పల్లిపాలెం ముంపు ప్రాంతంలో పర్యటించి అక్కడ ప్రజల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పి.గన్నవరం అక్విడెక్టు ప్రాంతంలోని వైనతేయ నదిని జలవనరులశాఖ ఎస్ఈ గోపీనాథ్ శుక్రవారం పరిశీలించి అధికారులతో సమీక్షించారు.

ఇన్‌చార్జి మంత్రి ఫోన్‌లో ఆరా..

జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు కోనసీమ జిల్లాలోని వరద పరిస్థితిపై విశాఖపట్నం నుంచి శుక్రవారం ఫోన్‌లో కలెక్టర్, ఎస్పీలతో సమగ్రంగా చర్చించారు. వరద ముంపు ఉన్న గ్రామాల్లో అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. లంక గ్రామాల్లో వరద ముంపు పెరిగితే బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాస చర్యలు చేపట్టాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. సహాయ చర్యల్లో జిల్లా అధికారులు ఎటువంటి నిర్లక్ష్యం చూపకూడదని, ప్రజల భద్రతకు ప్రాధాన్యమిచ్చి 24 గంటలు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్, ఎస్పీలను మంత్రి ఆదేశించారు. గోదావరి వరద పరిస్థితిపై రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమీక్షలు చేస్తూ అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తుందని మంత్రి స్పష్టం చేశారు.

కపిలేశ్వరపురం మండలం కేదార్లంకలో అరటితోటకు వరద నీరు





ముమ్మిడివరం మండలం లంక గ్రామాల్లో వరద పరిస్థితిని పరిశీలించి జాయింట్ కలెక్టర్ టి.నిషాంతితో చర్చిస్తున్న స్థానిక ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు

కూరగాయలు, అరటి పంటలకు నష్టం వాటిల్లే అవకాశం

పి.గన్నవరం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గోదావరికి వరదలు వస్తే ప్రధానంగా ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. లంక ప్రాంతాల్లో ముఖ్యంగా కూరగాయలు, అరటి, బొబ్బాయి, తమలపాకు, కొబ్బరి, కోకో, ఆయిల్ పామ్ తదితర పంటలు రైతులు పండిస్తారు. అయితే ఏడాది, రెండేళ్ల కాలపరిమితి పంటలకు ఈసారి పూర్తిస్థాయిలో నష్టం వాటిల్లే అవకాశం ఉంది. గత నాలుగు రోజులుగా పెరుగుతున్న వరద కారణంగా అరటి, బొబ్బాయి, తమలపాకు, కూరగాయల్లో బెండ, బీర, మునగ, ఆనబ, వంగ, పచ్చిమిర్చి తదితర పంటలు పలుచోట్ల నీట మునిగాయి. కూరగాయల పంటలను ఎక్కువగా చిన్నకారు, కౌలురైతులు పండిస్తుంటారు. ఏడాదిపాటు పంటను పండించి వరదల సమయంలో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అయితే వరద నీరు చేరి రెండు రోజులు దాటితే కూరగాయల పంటలతోపాటు బొబ్బాయి, తమలపాకు పంటలకూ తీవ్రనష్టమే. వారం రోజులు నుంచి పదిరోజులపాటు వరద నీరు నిల్వ ఉంటే అరటికి సైతం నష్టం వాటిల్లే అవకాశం ఉంది. అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలోని 16 మండలాల్లో 98 గ్రామాలు గోదావరి తీర ప్రాంతంలో ఉన్నాయి. వాటిలో ముఖ్యంగా 5,308 హెక్టార్లలో ఉద్యాన పంటలు పండించగా ధవళేశ్వరంలో రెండో ప్రమాద హెచ్చరిక జారీచేస్తే 14 మండలాలకు 64 గ్రామాల్లో 2,988 హెక్టార్లకు నష్టం వాటిల్లే అవకాశం ఉంది. మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తే 16మండలాల్లో ఉద్యాన పంటలను నష్టం వాటిల్లే అవకాశం ఉందని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. కాగా రెండో ప్రమాద హెచ్చరిక నడుస్తుండడంతో 2,988 హెక్టార్ల ఉద్యాన పంటలు నీటమునిగే అవకాశం ఉందని, వారంలోపు ఎంతమేర పంటచేలు నీట మునిగాయో, ఎంతమేర నష్టం వాటిల్లే అవకాశం ఉందో తదితర అంశాలను అంచనా వేసే అవకాశం ఉందని ఉద్యానశాఖకు చెందిన ఓ అధికారి చెప్పారు. అయితే తాము తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.





గ్యాస్ లీకై వస్తున్న మంటలు, లీకైన ప్రాంతంలో కాలిపోయిన మడ అడవి

ఓఎన్‌జీసీ గ్యాస్ పైప్‌లైన్ లీక్

40 అడుగుల మేర ఎగిసిపడిన మంటలు

ఆహుతైన మడ అడవులు

7

వరద ప్రాంతాల్లో 32 వైద్య ఆరోగ్య కేంద్రాలు

ముమ్మిడివరం,ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): వరద ప్రభావిత ప్రాంతాల్లో జిల్లాలో 32 చోట్ల ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటుచేసినట్టు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎం.దుర్గారావుదొర పేర్కొన్నారు. ఈ శిబిరాల్లో వైద్య సిబ్బంది ప్రజలకు అత్యవసర వైద్యసేవలు అందించేందుకు 24 గంటలు అందుబాటులో ఉంటాయన్నారు. పాముకాటు, కుక్కకాటుకు సంబంధించిన వ్యాక్సిన్లు శిబిరాల్లో సిద్ధంగా ఉంచామన్నారు. వరద ప్రభావిత ప్రాంతాలైన ముమ్మిడివరం మండలంలోని లంకాఫ్ ఠాణేలంక, కూనాలంక, గురజాపులంకల్లో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాలను శుక్రవారం సందర్శించి సిబ్బందికి సూచనలిచ్చారు. ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలకు సూచనలిచ్చారు.



కలెక్టర్ మహేష్‌కుమార్‌ను కలిసిన గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు

గణపతి నవరాత్రి ఉత్సవాలకు ఇబ్బందులు పెట్టవద్దు

జిల్లా కలెక్టర్‌కు కోనసీమ జిల్లా గణేష్ ఉత్సవ కమిటీ వినతి

అమలాపురం టౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): గణేష్ నవరాత్రి ఉత్సవాలకు ఎటువంటి ఇబ్బందులు పెట్టకుండా పోలీసు, రెవెన్యూ అధికారులు సహకరించాలని కోరుతూ కోనసీమ జిల్లా గణేష్ ఉత్సవ కమిటీ సమావేశం తీర్మానించింది. ఈనెల 27 నుంచి జరిగే నవరాత్రి ఉత్సవాలకు, గణేష్ నిమజ్జనోత్సవాలకు తగిన ఏర్పాట్లు చేయాలని తీర్మానించారు. అమలాపురంలో శుక్రవారం జిల్లా కమిటీ నూతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కమిటీ జిల్లాశాఖ అధ్యక్షుడిగా జి.భానుప్రకాష్, ఉపాధ్యక్షుడిగా పెన్మెత్స గోపాలకృష్ణంరాజు, బోనం సత్యసాయి, కార్యదర్శిగా అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం, సహ కార్యదర్శులుగా ఆకొండి పవన్‌కుమార్, గొవ్వాల రాజేష్, కోశాధికారిగా శిష్టా కామేశ్వరరావు, సభ్యులుగా దార్ల పాపయ్యాచారి, వాకపల్లి స్వామినాయుడు, చిక్కాల రాంబాబు తదితరులను ఎన్నుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. గణపతి నవరాత్రులు నిర్వహించే మండపాల వద్ద పారిశుధ్యం, వైద్యం, విద్యుత్, భద్రతతోపాటు నిమజ్జనోత్సవ ప్రాంగణంలో క్రేన్లు తదితర వసతులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. విగ్రహాల ఎత్తుపై ఆంక్షలు, అనుమతుల పేరుతో రకరకాల రుసుములు వసూలుచేయడం, పర్యావరణ కాలుష్యం పేరుతో నియంత్రణ పెట్టడం తదితర అంశాలపై స్థానిక పోలీసులకు తగిన సూచనలు చేయాలని ఎస్పీ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. త్వరలోనే గణేష్ ఉత్సవ కమిటీ జిల్లాశాఖ ప్రతినిధులతో అధికారులు సమావేశం నిర్వహించాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నిషాంతి

స్వమిత్వ సర్వేపై జాయింట్ కలెక్టర్ నిషాంతి సమీక్ష

అమలాపురం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నివశించే ప్రజలకు భూమి హక్కులను నిర్ధారించడానికి, సరిహద్దును గుర్తించడానికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రక్రియే స్వమిత్వ సర్వే అని జేసీ నిషాంతి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎనిమిదో దశ స్వమిత్వ సర్వే 29 ఆవాసాల్లో జరుగుతున్న ప్రక్రియపై డిజిటల్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, విలేజ్ సర్వేయర్లు, వీఆర్వోలతో జేసీ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రౌండ్ ట్రూథింగ్, గ్రౌండ్ వాల్యూయేషన్ డేటా ఆధారంగా రోవర్ పాయింట్ల గుర్తింపు, దశల వారీ గురించి వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఆస్తుల డిజిటల్ రికార్డులు సృష్టించడం ద్వారా ఆస్తి రికార్డులపై స్పష్టత వస్తుందన్నారు. ఈ సర్వే ద్వారా గ్రామాల్లోని భూములకు ఆస్తులకు సంబంధించిన రికార్డులు ఖచ్చితంగా తయారవుతాయని, ఆస్తి వివాదాలు తలెత్తే అవకాశాలు ఉండవన్నారు. ఆస్తులకు చట్టబద్ధత లభించడం, వాటిని క్రయవిక్రయాలు, పెట్టుబడులు పెట్టడం వంటి ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయన్నారు. భూసేకరణకు సంబంధించి సమర్థవంతంగా అమలు చేయడానికి ఈ రికార్డులు ఉపయోగపడతాయని చెప్పారు. డీపీవో శాంతలక్ష్మి, డీఎల్డీవోలు రాజేశ్వరరావు, త్రినాథరావు, విద్యాలక్ష్మి పాల్గొన్నారు.

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

వీడియో కాన్ఫరెన్సులో మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశం

జిల్లాలో ఎరువుల నిల్వల వివరాలు తెలియజేసిన కలెక్టర్ మహేష్‌కుమార్



అమలాపురం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఎరువుల కృత్రిమ కొరతను సృష్టించి వాటిని అధిక ధరలకు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ హెచ్చరించారు. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు శుక్రవారం రాష్ట్రస్థాయి అధికారులతోపాటు జిల్లా కలెక్టర్లతో అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఎరువుల కృత్రిమ కొరత సరఫరా అంశాలపై ప్రధానంగా సమీక్షించారు. కలెక్టర్ మహేష్‌కుమార్ ఈసందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 42 వేల మెట్రిక్ టన్నుల రిక్వైర్‌మెంట్ ఉండగా ఇప్పటికే 32 వేల మెట్రిక్ టన్నులు సరఫరా అయ్యాయని, 14 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. వాటిలో 3800 మెట్రిక్ టన్నుల యూరియా, డీఏపీ 700, పొటాషియం 1000, కాంప్లెక్సు ఎరువులు 7600 మెట్రిక్ టన్నులు, భాస్వరం 1200 మెట్రిక్ టన్నులు ఉన్నాయన్నారు. ఈ నెలలో 6వేలు, సెప్టెంబరులో 8వేల మెట్రిక్ టన్నుల ఎరువులు జిల్లాకు వస్తాయని, రబీ సీజన్‌లో 71వేల మెట్రిక్ టన్నులు ఎరువులు జిల్లాకు సరఫరాకు అవకాశం ఉందన్నారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టించే ప్రైవేటు డీలర్లపై నిఘా ఉంచి ఆకస్మిక తనిఖీ ద్వారా వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు. జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు, మార్క్‌ఫెడ్ ఏడీ మంజుల, జిల్లా సహకార అధికారి రాధాకృష్ణ, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.



వినాయకచవితి ఏర్పాట్లపై సమీక్ష

అయినవిల్లి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయంలో జరిగే వినాయకచవితి ఉత్సవాలపై కొత్తపేట ఆర్డీవో శ్రీకర్, డీఎస్పీ సుందర మురళీమోహన్ శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉచిత దర్శనానికి వెళ్లే క్యూలైన్లు, అన్నప్రసాదాలకు వెళ్లే క్యూలైన్లు, ప్రత్యేక దర్శనం క్యూలైన్లను పరిశీలించారు. వాహనాల పార్కింగ్‌కు వినాయక సదన్ వద్ద పార్కింగ్ స్థలాన్ని పరిశీలించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి అల్లు దుర్గాభవానీకి పలు సూచనలు చేశారు. సమీక్షలో సర్పంచ్ కాకర శ్రీనివాస్, తహశీల్దార్ సీహెచ్ విద్యాపతి, ఎంపీడీవో సరోవరరావు, సీఐ ఆర్.భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

అయినవిల్లిలో వినాయకచవితి ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆర్డీవో, డీఎస్పీలు

అన్నీ కంటిచూపుతోనే

దివ్యాంగులకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్

రూపొందించిన అమలాపురం విద్యార్థి పూజారి అనిల్‌బాబు

6



కంటిచూపుతో ల్యాప్‌టాప్‌ను పనిచేయిస్తున్న అనిల్‌బాబు

చేతులు లేవని కలత చెందవద్దు...
కంటిచూపుతో కంప్యూటర్, ల్యాప్‌ట్యాప్‌లతో అద్భుతాలు సృష్టించవచ్చు. చేతులు లేవని పరీక్ష రాయడానికి మరో వ్యక్తి అవసరం కూడా లేదు. అదే కంటిచూపుతో పరీక్ష రాయవచ్చు. కాళ్లు, చేతులు లేకపోయినాస్విచ్‌లతో పని లేకుండా కంటిచూపుతోనే ఇంట్లోని అన్ని రకాల ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ వస్తువులను వినియోగించుకోవచ్చు. ఇందుకోసం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణానికి చెందిన పూజారి అనిల్‌బాబు ప్రత్యేకమైన సాఫ్ట్‌వేర్ డిజైన్ చేశాడు. ఒక్కసారి ఆ సాఫ్ట్‌వేర్‌ను ఇన్‌స్టాల్ చేసుకుంటే చాలు దివ్యాంగులు తమ కంటిచూపుతోనే ఎన్నో పనులు చేయవచ్చు. అంతేకాదు. కంప్యూటర్ నాలెడ్జ్ పెంపొందించుకుని సాధారణ కుటుంబ అవసరాలకు తగ్గ ఆదాయం కూడా సంపాదించుకోవచ్చంటున్నాడు.

అన్నీ కంటిచూపుతోనే...

దివ్యాంగులకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించిన అమలాపురం విద్యార్థి పూజారి అనిల్‌బాబు

అమలాపురం టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అమలాపురం రూరల్ మండలం భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో పూజారి అనిల్‌బాబు పాలిటెక్నిక్ సీఎంఈ గ్రూపులో తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన అనిల్ తండ్రి అతడి చిన్నతనంలోనే రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. తల్లి మంగ ఎంతో కష్టపడి కుమారుడిని చదివించింది. కంప్యూటర్ విద్యపై ఉన్న మక్కువను గుర్తించి అప్పు చేసి మరీ ల్యాప్‌టాప్ కొనిచ్చింది. అప్పటివరకు సెల్‌ఫోన్‌లో ఎన్నో అద్భుతాలు సృష్టించిన అనిల్ ల్యాప్‌టాప్ రావడంతో రెండేళ్ల కాలంలో పలు నూతన అద్భుతాలను ఆవిష్కరించాడు.

'హెల్ప్ టు డిజైబుల్ పీపుల్'కు ప్రథమ స్థానం

దివ్యాంగులు ఏ ఒక్కరి మీద ఆధారపడకుండా స్వశక్తితో తమ పనులు చేసుకునేలా చేయాలన్న సంకల్పంతో అనిల్‌బాబు హెల్ప్ టూ డిజైబుల్ పీపుల్ ప్రాజెక్టుకు రూపకల్పన చేశాడు. ఇందుకోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించాడు. దాని ఆధారంగా కంటిచూపుతోనే ల్యాప్‌ట్యాప్, కంప్యూటర్లను పూర్తిస్థాయిలో దివ్యాంగులు వినియోగించుకోవచ్చు. కంటిచూపుతోనే ఫేస్‌బుక్, వాట్సాప్‌లను ఓపెన్ చేయడంతో పాటు యూట్యూబ్‌లో ఏమైనా చూడవచ్చు.

- అక్కడితో ఆగకుండా చేతులు లేనివారు కంటిచూపుతో పరీక్ష రాసే సాఫ్ట్‌వేర్‌ను కూడా రూపొందించాడు. ల్యాప్‌టాప్‌లో కనులు చూసే అక్షరాలు వరుసక్రమంలోకి వచ్చేస్తాయి. దాంతో కేటాయించిన సమయంలో పరీక్ష రాసే అవకాశం కల్పించాడు.
- ఇక దివ్యాంగులు ఇంట్లో ఫ్యాన్లు తిరగడానికి, లైట్లు వెలిగించడానికి, చివరికి టీవీ చూడడంతో పాటు ఎలక్ట్రానిక్ పరికరాలు అన్నింటినీ కంటిచూపుతోనే ఆపరేట్ చేసే సాఫ్ట్‌వేర్ అందరితో ఔరా అనిపించింది.
- వీల్‌చైర్‌కు పరిమితమైన దివ్యాంగుడు బాత్‌రూమ్‌కు వెళ్లాలన్నా, కుడివైపునకు, ఎడమ వైపునకు తిరగాలన్నా కంటిచూపుతో తిరిగేలా సాఫ్ట్‌వేర్‌ను డిజైన్ చేశాడు.
- దివ్యాంగులు ఏ ఒక్కరి మీద ఆధారపడకుండా ఉండాలని అందుకే వారి కోసం ఈ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించినట్టు అనిల్‌బాబు తెలిపాడు. ఈ సాఫ్ట్‌వేర్ జాతీయ స్థాయి ప్రదర్శనలో ప్రథమ స్థానం సాధించింది.





సాఫ్ట్‌వేర్ రూప శిల్పి అనిల్‌బాబు (పైన)
అతడిని అభినందిస్తున్న మంత్రి లోకేశ్ (కింద)



ఎంటర్‌ప్రెన్యూర్ సమ్మిట్‌లో రూ.1.25 లక్షలు నగదు బహుమతి

భవానీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో ఈ నెల 21న ఎంటర్‌ప్రెన్యూర్ సమ్మిట్-2025 కార్యక్రమం నిర్వహించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి విద్యార్థులు 135 ప్రాజెక్టులతో సమ్మిట్‌లో పాల్గొన్నారు. డిప్లొమా విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టుల ప్రదర్శనకు వెళ్లేందుకు అనిల్‌కు దారి ఖర్చులు కూడా లేని పరిస్థితుల్లో ఒకరు చేయి అందించి ముందుకు పంపించారు. విద్యార్థులు ఎన్నో నూతన ఆవిష్కరణలతో 135 ప్రాజెక్టులతో సమ్మిట్‌లో పాల్గొన్నప్పటికీ అనిల్ రూపొందించిన 'హెల్ప్ టు డిజైబుల్ ప్రాజెక్టు ప్రథమస్థానంలో నిలిచింది. రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌తో పాటు పలువురు ప్రముఖుల ద్వారా రూ.1.25లక్షల విలువైన చెక్కు అందుకున్నాడు. సమ్మిట్‌లో పాల్గొన్న టాటా ఇన్నోవేషన్ ప్రతినిధుల దృష్టి అనిల్‌పై పడింది. 2024 డిసెంబరు 4న కాకినాడ ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా విద్యార్థులకు జాతీయస్థాయిలో ప్రాజెక్టు ఎక్స్‌పో నిర్వహించారు. అందులో అనిల్ రూపొందించిన డిజైబుల్ పీపుల్ ప్రాజెక్టుకే ప్రథమ స్థానం లభించగా రూ.25వేలు నగదు బహుమతి అందించారు. అత్యుత్తమ ఆవిష్కరణలు చేసిన విద్యార్థులను ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేకంగా అమరావతి రప్పించుకున్నారు. అనిల్‌బాబును, అతను రూపొందించిన ప్రాజెక్టులను లోకేశ్ ప్రత్యేకంగా అభినందించారు. వినూత్నప్రాజెక్టుల రూపకల్పనలో ప్రభుత్వం తమ వంతు సాయం అందిస్తుందని ప్రకటించారు. అనిల్‌ను బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, ఆర్డీవో కె.మాధవి అభినందించారు. దొంగ ఓట్లను అరికట్టేందుకు 'అనిల్ ఓటింగ్ సిస్టమ్'ను అనిల్‌బాబు ఇప్పటికే రూపొందించాడు. సంబంధిత సాఫ్ట్‌వేర్‌ను ఫైనల్ స్థాయికి తీసుకెళ్తున్నానని వెల్లడించాడు. భవిష్యత్తులో దొంగ ఓట్లను అరికట్టేందుకు ఈ సాఫ్ట్‌వేర్ ఎంతగానో దోహదపడుతుందని చెప్పాడు.

సుమంత్ ఆఫీసు పనిపై హైదరాబాద్ వెళ్లాల్సి వచ్చింది. అయితే బస్ టికెట్ కోసం మన మిత్ర బస్‌ను ఆశ్రయించాడు. క్షణాల్లో ఆర్టీసీ బస్ టికెట్ బుక్ చేసుకున్నాడు. గతంలో ఇలా ఉండేది కాదు... ప్రైవేటు బస్సు ఏజెన్సీలను ఆశ్రయించాల్సి వచ్చేది.



శ్రీదేవి తన ఇద్దరి పిల్లలకు 'తల్లికి వందనం' డబ్బులు తన ఖాతాలో పడ్డాయో లేదో తెలుసుకునేందుకు పలుమార్లు బ్యాంకులకు వెళ్లేది. బ్యాంకు సిబ్బంది ఒక వారంలో పడొచ్చు అని చెప్పేవారు. అయితే పదేపదే బ్యాంకుల చుట్టూ తిరిగే ఓపిక లేని శ్రీదేవి తన మొబైల్‌లో మన మిత్ర వాట్సాప్ నంబర్ సేవ్ చేసుకుని హాయ్ అని టైపు చేసింది. సేవలను ఎంచుకోండి అంటూ రిప్లై మెసేజ్ రావడం, అందులో తల్లికి వందనం సేవల ఆప్షన్ కనిపించడంతో దానిపై క్లిక్ చేసింది. ఆ తర్వాత ఆమె ఆధార్ నంబర్ నమోదు చేయాలని చూపడంతో ఆమె తన ఆధార్ ఎంటర్ చేసింది. వెంటనే తల్లికి వందనానికి సంబంధించిన రూ.26వేలు ఆమె ఖాతాలో జమ అయినట్టుగా మెసేజ్ వచ్చింది.

చూశారా.. సుమంత్, శ్రీదేవిలాంటి వారే కాదు.. ఇలా ఎందరో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మన మిత్ర' వాట్సాప్ గవర్నెన్స్ సేవలను వినియోగించుకుంటున్నారు.

అన్నీ ఈ యాప్‌లోనే...

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

- ప్రజా సేవలో.. 'మన మిత్ర'
- 26 ప్రభుత్వ శాఖలకు సంబంధించి 161 సేవలతో ప్రారంభం
- ప్రస్తుతం ప్రజలకు అందుబాటులో 500 సేవలు



ప్రభుత్వ సేవల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా వాటిని ఇంటి నుంచే పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్ తీసుకొచ్చింది. 'మన మిత్ర' పేరిట అమలవుతోన్న ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా సేవలు పొందేందుకు, ఫిర్యాదులు చేసేందుకు సచివాలయ ఉద్యోగుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. 'మన మిత్ర' వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఈ-పౌర సేవలు అందిస్తున్న ప్రభుత్వం వాటిని 700కు పెంచాలని నిర్ణయించింది.


ఈ ఏడాది జనవరిలో 26 ప్రభుత్వ శాఖలకు సంబంధించిన 161 సేవలతో 'మన మిత్ర' వాట్సాప్ గవర్నెన్స్ ప్రారంభమైంది. తర్వాత సేవలను క్రమంగా పెంచుతూ.. ప్రస్తుతం ఆ సంఖ్య 500కు చేరింది.

ఏయే సేవలు అందుబాటులో అంటే..

- విద్యార్థులకు పరీక్షల హాల్ టికెట్లు, రేషన్ కార్డుల సేవలు, తల్లికి వందనం, అన్నదాతా సుఖీభవ స్టేటస్‌లు తెలుసుకునే వెసులుబాటు కల్పించారు. తెలుగు, ఆంగ్ల బాషల్లో ఈ సేవలు అందుబాటులో ఉన్నాయి.
- పౌరులు ఒక్క క్లిక్‌తో లైసెన్సులు, పన్నులు, బిల్లులు చెల్లించవచ్చు.
- ఆలయాల దర్శనాల బుకింగ్, ఆర్టీసీ టికెట్ బుకింగ్ వివరాలు, పరీక్షల ఫలితాల ఇంటి వద్ద నుంచే తెలుసుకునే అవకాశం కల్పించారు.
- అన్ని శాఖల డేటాను ఆర్టీజీఎస్‌తో ప్రభుత్వం అనుసంధానం చేసింది. ప్రతి ఒక్కరి వ్యక్తిగత సమాచారం ప్రభుత్వం వద్ద ఉంది. దీనిని శాఖల వారీగా 'మన మిత్ర' వాట్సాప్ గవర్నెన్స్‌కు అనుసంధానం చేశారు. క్యూఆర్ కోడ్‌తో ధ్రువపత్రాలు, ఇతర పౌర సేవలు పొందవచ్చు. భవిష్యత్తులో క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా నకిలీ, అసలు గుర్తించే సౌలభ్యం అందుబాటులోకి రానుంది.

ఇవి కూడా...

వ్యవసాయ పథకాలు, అన్నా క్యాంటీన్, ఏపీఈడీబీ సేవలు, ఏపీఎస్ఎస్‌డీసీ, పురపాలక, విద్య, ఎనర్జీ సేవలు (బిల్లుల చెల్లింపు, ఫిర్యాదులు), హెల్త్ కార్డు, పరిశ్రమలు, జైలు సేవలు, జీరో పావర్టీ పీ4 సేవలు, పంచాయతీరాజ్, ఎన్టీఆర్ భరోసా పింఛను పథకం, పోలీసు శాఖ, రెవెన్యూ, మైన్స్, భౌగోళిక సేవలు, క్రీడా ప్రాధికారం, సివిల్ సప్లయిస్, తల్లికి వందనం, టీటీడీ, దేవాలయాల సేవలు, మహిళా, శిశు సంక్షేమ సేవలను ఎంచుకోవచ్చు. వాటి వివరాలను తెలుసుకుని, ఆ సేవలను వినియోగించుకోవచ్చు.




ఇలా చేయాలి...

ప్రభుత్వ వాట్సాప్ నెంబరు 95523 00009ను 'మన మిత్ర' పేరిట మొబైల్‌లో నమోదు చేసుకోవాలి. దానికి హాయ్ అని సందేశం పంపాలి. వెంటనే ఏపీ ప్రభుత్వ లోగోతో రిప్లై మెసేజ్ వస్తుంది. తద్వారా మీకు కావాల్సిన సేవను ఎంపిక చేసుకోవాలి. వెంటనే మీకు వాట్సాప్‌లో ఏఐ ఆధారిత చాట్‌బాక్స్‌లో లభ్యమయ్యే అన్ని ప్రభుత్వ సేవల జాబితా కనిపిస్తుంది. అందులో మీకు కావల్సిన సేవలను ఎంపిక చేసుకోవచ్చు. వాయిస్ కమాండ్‌ను కూడా ఉపయోగించుకోవచ్చు. మీరు కోరుకున్న సేవకు సంబంధించి చాట్ బాక్స్ మరికొన్ని అదనపు వివరాలు అడగవచ్చు. మీ ఆధార్ నెంబరు, మొబైల్ నెంబరు లేదా సర్వీస్ రిక్వెస్ట్ ఐడీ లాంటివి. మీరిచ్చిన వివరాలను ఒక్కసారి తనిఖీ చేసి, తర్వాత అందులో సిస్టం మీకు రియల్ టైం అప్‌డేట్స్ ద్వారా ఒక కన్ఫర్మేషన్ మెసేజ్ పంపుతుంది. చెల్లింపుల కోసం భద్రతతో కూడిన ఒక పేమెంట్ లింక్ పంపుతుంది. మీరు జరిపిన లావాదేవీలకు సంబంధించి డిజిటల్ కాపీ లేదా రసీదును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. చాట్ బాక్స్‌లో ధ్రువీకరణ పత్రాలు, రసీదులు లేదా ఎక్‌నాలెడ్జ్‌మెంట్ రూపొందించి మీకు అందిస్తుంది.

నేడు పెద్దాపురానికి సీఎం చంద్రబాబు

పర్యటన ఇలా..



సామర్లకోట, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శనివారం కాకినాడ జిల్లా పెద్దాపురం, సామర్లకోటలలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా టీడీపీ కార్యకర్తల సమావేశం, ప్రజావేదిక సదస్సు, పీ4 సదస్సు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు పర్యటన షెడ్యూల్‌ను సీఎం వ్యక్తిగత కార్యదర్శి ఆర్.కృష్ణకపర్థి జారీ చేశారు. జిల్లా సమాచార పౌర సంబంధ అధికారి కార్యాలయం నుంచి శుక్రవారం పాత్రికేయులకు విడుదల చేశారు.

- శనివారం ఉదయం 10.10 గంటలకు ఉండవిల్లిలోని సీఎం చంద్రబాబు స్వగృహం నుంచి హెలీకాప్టర్‌లో బయలుదేరతారు.
- 11.00 గంటలకు పెద్దాపురం రోడ్లో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్దకు చేరుకుని 10 నిమిషాల పాటు జిల్లా అధికారులను, ప్రజా ప్రతినిధులను, ప్రజలను కలుస్తారు.
- 11.20 గంటలకు అక్కడి నుంచి రోడ్డు మార్గాన ప్రత్యేక వాహనంలో పెద్దాపురం మున్సిపాల్టీలోని పదో వార్డుకు చేరుకుంటారు.
- 11.20 నుంచి 12.00 గంటల వరకూ అక్కడ నిర్మించిన మేజిక్ డ్రైన్ సందర్శన, స్వచ్ఛ రథాల సందర్శన, పారిశుధ్య సిబ్బందికి బీమా సదుపాయం ప్యాకేజీ ప్రారంభ కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి పాల్గొంటారు.
- 12.00 గంటల నుంచి స్వచ్ఛత ర్యాలీని ప్రారంభించి పాల్గొంటారు.
- 12.25 గంటలకు పెద్దాపురం మున్సిపల్ కార్యాలయానికి చేరుకుంటారు.
- 12.30 గంటలకు ముఖ్యమంత్రి ప్రజావేదిక సదస్సుకు చేరుకుని 1.00 గంట వరకూ రిజర్వ్‌డ్‌గా ఉంటారు.
- మధ్యాహ్నం 1.00 గంటల నుంచి 2.40 గంటల వరకూ అక్కడ ఏర్పాటుచేసిన వివిధ స్టాల్స్‌ను సీఎం సందర్శిస్తారు. అనంతరం ప్రజావేదిక సదస్సులో పాల్గొంటారు.
- 2.40 గంటల నుంచి 2.45 గంటల వరకూ వివిధ వర్గాలకు చెందిన సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయన్సర్లతో మమేకం అవుతారు.
- 2.50 గంటలకు సామర్లకోట పూర్ణ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన టీడీపీ కార్యకర్తల సమావేశానికి హాజరై 3.50 గంటల వరకూ సమావేశంలో పాల్గొంటారు.
- 3.50 గంటలకు కళ్యాణ మండపం నుంచి ప్రత్యేక వాహనాల్లో పెద్దాపురంలో హెలీప్యాడ్‌కు 3.55 గంటలకు చేరుతారు.
- 3.55 గంటల నుంచి 4.40 గంటల వరకూ రిజర్వ్‌డ్‌గా ఉంటారు.
- 4.40 గంటలకు హెలీకాప్టర్‌లో అమరావతికి బయలుదేరతారు.
- 5.30 గంటలకు ఉండవల్లిలోని సీఎం స్వగృహంలోని హెలీప్యాడ్‌కు చేరుతారు.

శ్రీపాదశ్రీవల్లభుడికి సహస్ర చామంతి పూజ



ప్రత్యేక అలంకారంలో శ్రీపాదశ్రీవల్లభుడు

పిఠాపురం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో జరుగుతున్న శ్రీపాదశ్రీవల్లభ జయంతి సప్తాహ మహోత్సవాలు శుక్రవారం రెండో రోజుకు చేరుకున్నాయి. సహస్ర చామంతి పూజ నిర్వహించారు. శ్రీపాదుని దివ్య పాదపద్మాలకు ఏకాదశ రుద్రాభిషేకం, దత్తహోమం జరిగాయి. శ్రీపాద శ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతులను పుష్పాలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా ఈవో ఆర్.సౌజన్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కబళించిన మృత్యువు

- గుడ్డిగూడెంలో ట్రాక్టర్ బోల్తా
- ఓ మహిళ మృతి
- మరో ఇద్దరికి తీవ్ర, ఐదుగురికి స్వల్ప గాయాలు





బోల్తా పడిన ట్రాక్టర్, పద్మ(ఫైల్)

గోపాలపురం, 22(ఆంధ్రజ్యోతి): కూలినాలి చేసుకుని వచ్చిన కష్టంతో కుటుంబాల్ని పోషించుకుందామనుకున్న ఆ మహిళను మృత్యువు ప్రమాద రూపంలో కబలించింది. రోజువారి పనుల్లో భాగంగా కూలి పనికి వెళ్లి తిరిగి ఇం టికి వచ్చి భర్త, బిడ్డలకు వంట చేసి పెట్టాలనే ఆలోచనతో ట్రాక్టర్‌పై వస్తున్న మహిళ ట్రాక్టర్ తిరగబడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని గుడ్డిగూడెం గ్రామానికి చెందిన సుగ్గనబోయిన పద్మ(40) తనతోపాటు మరో ఏడుగురు మహిళలు కలిసి రోజువారి క్రమంలో భాగంగా శుక్రఎవారం ఉదయం ట్రాక్టర్‌పై కూలిపనికి వెళ్లారు. పని ముగించుకుని సాయంత్రం సమయంలో తిరిగి ఇంటికి వస్తుండగా ట్రాక్టర్ ప్రమాదవశాత్తు తిరగబడడంతో పద్మ అక్కడికక్కడే మృతి చెందింది. తనతో పాటు ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న ఇద్దరు మహిళలకు తీవ్రగాయాలు కాగా మరో ఐదుగురికి స్వల్పగాయాలయ్యాయి. వీరిని హుటాహుటిన గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ మనోహర్, దేవరపల్లి సీఐ నాగేశ్వరనాయక్‌లు పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేయాల్సి ఉంది.

బీసీ హాస్టళ్లలో మెరుగైన విద్యనందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

- బీసీ సంక్షేమశాఖ ఎక్స్‌అఫీషియో సెక్రటరీ సత్యనారాయణ
- ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల బీసీ వెల్ఫేర్ అధికారులు, హెచ్‌డబ్ల్యువోలతో సమీక్ష

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు మెరుగైన విద్యతోపాటు మంచి ఆహారం అందించేవిధంగా చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ ఎక్స్ అఫీషియో సెక్రటరీ ఎస్.సత్యనారాయణ అన్నారు. సెప్టెంబరు 5 నాటికి రాష్ట్రంలోని వసతి గృహాల్లో 244 మంది నాలుగో తరగతి సిబ్బందిని నియమించనున్నట్టు తెలిపారు. శుక్రవారం రాజమహేంద్రవరంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలోని జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారులు, హెచ్‌డబ్ల్యువోలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ సంక్షేమశాఖలోని హాస్టల్ వెల్ఫేర్ అధికారుల పనితీరు మెరుగుపర్చుకునేందుకు, వారి పనితీరు తెలుసుకోవడానికి నూతన విధానాన్ని తీసుకొచ్చామన్నారు. విధి నిర్వహణను బట్టి కొన్ని మార్కులు కేటాయిస్తామన్నారు. బీసీ సంక్షేమశాఖ డైరెక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ జిల్లా వెల్ఫేర్ అధికారులు కలెక్టర్లను సంప్రదించి వసతి గృహాల్లో ఉన్న సమస్యలను తెలియజేసి వారి నుంచి నిధులు పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. మూడు నెలలకు ఒకసారి జిల్లాలో సమీక్ష నిర్వహిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీసీ వెల్ఫేర్ అడిషనల్ డైరెక్టర్ డీసీఎస్ రాజు, ఎంజేపీ రెసిడెన్షియల్ స్కూల్ సెక్రటరీ పి.మాధవీలత, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారులు బి.శశాంక, సత్యరమేష్, వెంకటేశ్వరరావు, ఏబీసీ డబ్ల్యువోలు ముత్యాల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా దత్తు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా రాజమహేంద్రవరానికి చెందిన సీనియర్ నాయకుడు బొమ్ముల దత్తును నియమిస్తూ పార్టీ రాష్ట్రాధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.దత్తు గతంలో పార్టీ జిల్లా అధ్యక్షుడిగా చేశారు. ఆ తర్వాత ఎలాంటి పదవి దక్కలేదు. అయినా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గానే పాల్గొనేవారు. అలాగే బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్ష పదవి మరోసారి రొంగల గోపిశ్రీనివాస్‌కు దక్కింది.

యోగా కోర్సులకు

దరఖాస్తుల గడువు పెంపు

దివాన్‌చెరువు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ద్వారా కానవరంలోని శ్రీరాపర్తిరామ యోగా సంస్థలో పీజీ డిప్లమో ఇన్ యోగ, యోగా సర్టిఫికెట్ కోర్సులలో ప్రవేశాలకు ఈనెల29 వరకూ గడువు పొడిగించామని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయం వెబ్సైట్‌ను లేదా 73823 08440 నెంబరును సంప్రదించాలన్నారు. కౌన్సెలింగ్ ప్రకియ విశ్వవిద్యాలయం ప్రవేశాల డైరెక్టర్ ఆచార్య పి.ఉమామహేశ్వరీదేవి నిర్వహిస్తారన్నారు.

సదస్సు లక్ష్యాలను సమాజంలోకి తీసుకెళ్లాలి



సదస్సులో సర్టిఫికెట్లు అందుకున్న పరిశోధకులు

నన్నయలో ముగిసిన అంతర్జాతీయ సదస్సు

దివాన్‌చెరువు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ సదస్సులోని కీలక విషయాలను, లక్ష్యాలను సమాజంలోకి తీసుకు వెళ్లాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యాకళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.సుబ్బారావు అన్నారు. నన్నయ వర్శిటీ విద్యా కళాశాల ఆధ్వర్యంలో గిరిజన ప్రాచీన విజ్ఞాన పరిరక్షణ భవిష్యత్ తరాలకు చేర్చడం అనే అంశంపై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది.. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సుబ్బారావు మాట్లాడుతూ సదస్సుకు సంబంధించిన అంశాలపై 65 మంది పరిశోధన పత్రాలు సమర్పించారన్నారు. అందులో 40 ఉత్తమ పరిశోధన పత్రాలతో పుస్తకాన్ని ముద్రించామన్నారు. సదస్సు కన్వీనర్ ఆర్ఎస్ వరహాలదొర మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కువ మంది గిరిజనులు ఉన్న దేశాలలో భారత్ రెండో స్థానంలో ఉందన్నారు. గిరిజన థింసా నృత్యం అందరూ ఐక్యతగా ఉన్నారనే సంకేతాన్ని సుఖదుఃఖాలను సమానంగా ఇస్తుందన్నారు. ముగింపు సమావేశానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 23 మంది పరిశోధకులు తమ పరిశోధనా పత్రాలను సమర్పించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు మంత్రి మదన్‌మోహన్ చేసిన నృత్యప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం పరిశోధకులకు సర్టిఫికెట్‌లు అందజేశారు. కార్యక్రమంలో సమన్వయకర్త ఆర్.సాంబశివరావు, ఎం.గోపాలకృష్ణ, జి.ఎలీషాబాబు, జె.రాజమణి, వి.రామకృష్ణ, ఎస్.సుజాత, కె.ఎస్.ఆర్.రాజేశ్వరీదేవి పాల్గొన్నారు.



మదన్‌మోహన్ నృత్యప్రదర్శన

ముంపులోనే కోనసీమ

వరద నీటిలో లంక గ్రామాలు
ఆందోళనలో రైతులు

అలమూరు/పి.గన్నవరం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వరద ఉధృతి కారణంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని పలు గ్రామాల్లో ఇంకా ముంపు నీటిలోనే ఉండిపోయాయి. ఆలమూరు మండలం మూలస్థాన అగ్రహారం వద్ద ఇటీవల నిర్మించిన కాజ్‌వే గోదావరి వరద ఉధృతికి కొట్టుకుపోయింది. అధికారులు కాజ్‌వేను పరిశీలించి తోకలంకకు రాకపోకలు సాగించే విధంగా నాటుపడవలు ఉండడంతో తగుజాగ్రతలు తీసుకోవాలని సూచించారు. లంక గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలకు వరదనీరు చేరుకుంది. అలాగే పి.గన్నవరం మండలంలోని బూరుగులంక నదీపాయ ఉధృతంగా ప్రవహించడంతో హైలాండ్‌పై ఉన్న ఉడిమూడిలంక, పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలు, రైతులు, విద్యార్థులు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనకాయలంక కాజ్‌వే పూర్తిగా జలదిబ్బంధంలో ఉండడంతో లంక గ్రామంలోని ప్రజలు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యసాయ ఉత్పత్తులు సైతం పడవలపైనే ఇవతలి ఒడ్డుకు చేర్చుకుంటున్నారు. అలాగే జిల్లాలోని పలుగ్రామాల్లో ఉద్యానపంటలు ముంపులో ఉన్నాయి. దీంతో తమకు నష్టం తప్పదని రైతులు ఆవేదన చెందుతున్నారు.



అంతర్వేది: వరద నీటితో మునిగిన సఖినేటిపల్లి వంతెన



కూనవరం - వరరామచంద్రపురం మండలాల నడుమ శబరి, గోదావరి నది సంగమం



కోటిపల్లిలో మత్స్యకార కాలనీలోకి చేరిన వరద నీరు



పి.గన్నవరం మండలం గంటిపెదపూడి ఏటిగట్టు దిగువున వరదనీటిలో రైతుల కష్టాలు



ఐ.పోలవరంలో ఎదుర్లంక బ్రిడ్జి వద్ద వరద





పి.గన్నవరం మండలం చాకలిపాలెం వద్ద కనకాయలంక కాజ్‌వే వద్ద పడవపై రాకపోకలు, ఉడిమూడి ఏటిగట్టు దిగువున వరద నీటిలో నివాసాలు



ముమ్మిడివరం మండలం లంకాఫ్ ఠాణేలంకలో మునిగిన పూరిపాకలు

చింతూరులో తగ్గని ఉధృతి

చింతూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా చింతూరు డివిజనులో శబరి, గోదావరి ఉధృతి కొనసాగుతోంది. భద్రాచలం వద్ద గోదావరి శుక్రవారం ఉదయం 4 గంటలకు 50.10 అడుగుల మేర ప్రవహించి సాయంత్రం 6 గంటలకు 43.90 అడుగులకు చేరుకుంది. సాయంత్రం 6 గంటలకు చింతూరు వద్ద శబరి 38 అడుగులు, కూనవరం వద్ద గోదావరి 49 అడుగుల మేర ప్రవహిస్తోంది. దీంతో చింతూరు, కూనవరం, వరరామచంద్రపురం మండలాల్లో వరద ఉధృతి యథాస్థితిగా ఉంది. దీంతో లోతట్టు వాసులు నిత్యావర వస్తువుల కోసం ఇక్కట్లు పడుతున్నారు. తమకు త్వరగా పరిహారం, పునరావాసం కల్పించి ఇక్కడ నుంచి తరలించాలని పోలవరం నిర్వాసితులు అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు. కూనవరం మండలంలో పర్యటించిన అల్లూరి సీతారామరాజు కలెక్టర్ దినేష్‌కుమార్‌కు బాధితులు తమ ఇబ్బందులపై మొరపెట్టుకున్నారు.

వరద ఉధృతిని పరిశీలించిన ఏలూరు రేంజ్ ఐజీ

ధవళేశ్వరం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంలో కాటన్ బ్యారేజ్ వద్ద గోదావరి వరద ఉధృతిని ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ పరిశీలించారు. శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహకిషోర్, కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్, రాజమహేంద్రవరం దక్షిణ మండలి డీఎస్పీ భవ్యకిషోర్‌తో కలిసి బ్యారేజ్‌పైకి చేరుకుని పరిశీలించారు. ఇరిగేషన్ జేఈ రాధాకృష్ణ వరద పరిస్థితిని వివరించారు. ధవళేశ్వరం సీఐ గణేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ధవళేశ్వరం వద్ద నీటి మట్టం శుక్రవారం రాత్రి 7 గంటలకు 14.20 అడుగులకు చేరుకోగా 13,48,226 క్యూసెక్కులు దిగువకు ప్రవహిస్తుంది.



కాటన్ బ్యారేజ్‌పై వరద ఉధృతిని పరిశీలిస్తున్న ఐజీ

శ్రావణ లక్ష్మి నమోస్తుతే..



సత్యదేవుడి ఆలయంలో వరలక్ష్మి వ్రతాలు ఆచరిస్తున్న మహిళలు



పాదగయలో శ్రావణ లక్ష్మి



వరలక్ష్మీవ్రతం ఆచరిస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు సతీమణి పద్మజ, మహిళలు

రత్నగిరిపై ఉచిత సామూహిక వరలక్ష్మి వత్రాలు

తరలివచ్చిన 10వేలమంది మహిళలు

అన్నవరం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): చివరి శ్రావణ శుక్రవారం కావడంతో కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. ఇందుకు విశేష స్పందన లభించింది. వివిధ ప్రాంతాల నుంచి సుమారు 10 వేలమంది మహిళలు హాజరుకాగా 4ప్రత్యేక మండపాల్లో 3 బ్యాచ్‌లుగా వ్రతాలు నిర్వహించారు. ఉదయం 8గంటలకు నిత్యకల్యాణమండపంలో ఈ వో వీర్ల సుబ్బారావు దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రా రంభించారు. ప్రత్యేక వేదికపై సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను.. మరో వేదికపై వరలక్ష్మీదేవిని ఆశీనులు గావించి పండితులు గణపతిపూజతో కార్యక్రమం ప్రా రంభించారు. అమ్మవారికి విశేష పూజల అనంతరం మహిళలతో పసుపు, కుంకుమలతో అష్టోత్తరశతనామాలతో ఆచరింపచేశారు. అనంతరం వరలక్ష్మి వ్రతకథను శ్రావ్యంగా వివరించారు. మహిళలకు దేవస్థానం ఆ ధ్వర్యంలో అమ్మవారి రాగిప్రతిమ, రవికలవస్త్రం, ప్ర సాదం ప్యాకెట్టు ఉచితంగా పంపిణీ చేశారు. వ్రతం అనంతరం భక్తులకు ప్రత్యేకదర్శనం, ఉచిత అన్నప్రసాద వితరణ చేపట్టారు. దశాబ్దంగా ఈ వ్రతాలు ప్రతీ ఏటా చేపడుతున్న ఈ ఏడాది విచ్చేసిన మహిళలు మునుపెన్నడూ రాలేదనే చెప్పాలి. ఉదయం 8 ప్రారంభమైన వ్రతాలు మధ్యాహ్నం 2గంటల వరకు నిరంతరాయంగా జరిగాయి. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఈవో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సిబ్బంది సమష్టి కృషితో కార్యక్రమం విజయవంతమైందని ఈవో పేర్కొన్నారు.





వరలక్ష్మి పూజా క్రతువు నిర్వహిస్తున్న పండితులు, జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఈవో దంపతులు

పాదగయలో వైభవంగా వరలక్ష్మి వ్రతాలు

మహిళలకు పవన్ పంపిన 14వేల చీరల అందజేత

పిఠాపురం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మి వ్రతాలు వైభవంగా జరిగాయి. అంబిక, భ్రమరాంబ, చాముండి, దుర్గ, ఈశ్వరి పేర్లతో ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు 5 బ్యాచ్‌లుగా వ్రతాలు జరిపించారు. దత్తాత్రేయ మండపం, సరస్వతీదేవి మందిరం సహా ఆలయ ప్రాం గణంలో మహిళలు వ్రతాలు ఆచరించారు. వేదపండితులు, ఘనాపాఠీల మంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా శ్రావణ లక్ష్మికి పూజలు జరిగాయి. భక్తులకు కొబ్బరికాయ, గాజులు, పసుపు, కుంకు మ, అరటి పళ్లు, పువ్వులు, పూజా సామగ్రి, చీర, రవిక, వరలక్ష్మి రూపు, ప్రసాదం ప్యాకెట్లు పంపిణీ చేశారు. క్షేత్రంలో వస్తున్న సంప్రదాయం, అనవాయితీకి అనుగుణంగా చీరలు, పసుపు, కుంకుమ, గాజులను ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్‌కల్యాణ్ సమకూర్చారు. 14వేల చీరలను పవన్ సమకూర్చారు. వీటిని భక్తులకు జనసేన ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నాగమణి సతీమణి కొణిదెల పద్మజ, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు అందజేశారు. మహిళలతో పాటు పద్మజ వరలక్ష్మీ వ్రతం ఆచరించారు. ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్, సీఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.




చీరలు అందుకున్న మహిళలు

ఓఎన్‌జీసీ గ్యాస్ పైప్‌లైన్ లీక్

40 అడుగుల మేర ఎగిసిపడిన మంటలు

ఆహుతైన మడ అడవులు

యానాం/ఐ.పోలవరం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): యానాం, కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం భైరవపాలెం వద్ద సరిహద్దు ప్రాంతంలో సముద్రం నుంచి గోదావరి మీదుగా వెళ్లే ఓఎన్‌జీసీ గ్యాస్ పైప్‌లైన్ లీక్ అవ్వడంతో మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో ఒక్కసారిగా ఆకాశం ఎరుపెక్కింది. సుమారు 40అడుగుల మేర మంటలు ఎగిసిపడంతో స్థానికులు ఒక్కసారిగా భయభ్రాంతులకు గురయ్యారు. శుక్రవారం తెల్లవారు జామున 2.30గంటలకు జరిగిన ఈ సంఘటన అందరిని ఉలిక్కిపడేలా చేసింది. స్థానికులు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావుకు ఫోన్లో సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన ఓఎన్‌జీసీ, యానాం పరిపాలనాధికారి, పోలీసులతో మాట్లాడి సంఘటన ప్రాంతానికి వెళ్లాలని సూచించారు. ఓఎన్‌జీసీకి చెందిన సేఫ్టీ అధికారులు పైప్‌లైన్ నుంచి వచ్చే గ్యాస్‌ను సముద్రంలోనే వాల్ మూసివేయడంతో మంటలు అదుపులోకి వచ్చాయి. ఇటువంటి సంఘటనలు జరగకుండా ఉండాలంటే చమురు సంస్థల అధికారుల పర్యవేక్షణ ఎప్పటికప్పుడు ఉండాలని మల్లాడి అన్నారు. సంఘటనా ప్రాంతం సమీపంలోని మడ అడవులు అగ్నికి ఆహుతయ్యాయి. మంటలు ఐలాండ్-3 పైప్ నుంచి ఐలాండ్-2 పైప్‌లైన్‌కు వ్యాపించడంతో సుమారు 3 కిలోమీటర్ల మేర చెట్లు, మొక్కలు కాలి బూడిదయ్యాయి. అయితే ప్రమాదం ఏ విధంగా జరిగిందే అనేది చమురుసంస్థలకు చెందిన అధికారులే తేల్చాసి ఉంది. ఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్, గూటం శివగణేష్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆర్ధాని దీనేష్, మెల్లం శ్రీనివాస్ బృందం సంఘటన ప్రాంతాన్ని సందర్శించారు. ఆర్ధాని దినేష్ మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ సంఘటన జరిగిందన్నారు. గత సెప్టెంబరు 21న పైప్‌లైన్ లీక్ అయినప్పుడే చర్యలు తీసుకోవాలని కోరితే తూతూమంత్రంగా రక్షణ చర్యలు చేపట్టారని, అందువల్ల ఈరోజు ఈ పరిస్థితి వచ్చిందని ఇప్పటికైనా తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. గ్యాస్ పైప్‌లైన్ లీక్ అవ్వడం వల్ల చేపలు చనిపోతున్నాయని భైరవపాలెం, గాడిమొగ మత్స్యకారులు ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబుకు విన్నవించారు.



గ్యాస్ లీకై వస్తున్న మంటలు, లీకైన



ప్రాంతంలో పొంగుతున్న నీరు

పిచ్చి కుక్క స్వైర విహారం

ఏవీనగరంలో ఐదుగురికి తీవ్ర గాయాలు

తొండంగి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తొండంగి మండలం ఏవీనగరం గ్రామంలో శుక్రవారం పిచ్చికుక్క స్వైర విహారం చేసి ఐదుగురిని తీవ్రంగా గాయపరిచింది. గ్రామానికి చెందిన మడికి పేరంటాలు (55), కొంజర్ల భవిష్య(5), గొలుసు కృష్ణవేణి (30), సన్ని శివ(10), కుక్కా అభిరామ్ (5)ను కరవడంతో తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స నిమిత్తం తీసుకువెళ్లారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడ తరలించారు. వారితో పాటు మరో రెండు గేదె దూడల్ని కూడా గాయపరిచింది. వారిని కరిచిన కుక్క గ్రామంలోని వీధుల్లో తిరుగుతుండడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. మూకుమ్మడిగా దానిని పొలాల వైపు వెళ్లగొట్టారు. గ్రామంలోని పిల్లలు, వృద్ధులు భయానికి గురయ్యారు. గ్రామంలో విచ్చలవిడిగా తిరుగుతున్న కుక్కలను కట్టడి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని మాజీ ఎంపీపీ యనమల కృష్ణ కోరారు.



పిచ్చికుక్క దాడిలో గాయపడ్డ బాలుడు

దేవదాయ శాఖలోనే శ్రీవారాహి అమ్మవారి ఆలయం

కాకినాడ రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం కొవ్వూరులోని శ్రీవారాహి అమ్మవారి ఆలయాన్ని దేవదాయ, ధర్మదాయ శాఖ ఇటీవల స్వాధీనం చేసుకోవడంపై పూర్వపు ఆలయ నిర్వాహకురాలు కె.ప్రసన్నరాణి పద్మలక్ష్మి హైకోర్టులో కేసు వేశారు. అయితే పిటీషన్‌పై విచారించిన కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. శ్రీవారాహి అమ్మవారికి ప్రసన్నరాణి పద్మలక్ష్మి పూజలు మాత్రమే చేసుకోవచ్చని, ఆలయానికి సంబంధించిన ఇతర వ్యవహారాలన్నింటినీ దేవదాయ శాఖ చూసుకుంటుందని కోర్టు తీర్పులో పేర్కొన్నట్టు ఆలయ ఇన్‌చార్జి ఈవో ఆర్.సౌజన్య తెలిపారు. అదే విధంగా ఇప్పటి వరకూ ఆలయానికి వచ్చిన దాతల చందాలు, ఆదాయ, వ్యయాలకు సంబంధించిన బ్యాంకు రికార్డులను సమర్పించాలని కోర్టు ఆదేశించిందని ఈవో పేర్కొన్నారు.

ఇంట్లో 38 గ్రాముల బంగారం, నగదు చోరీ

అంబాజీపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఓ ఇంట్లో దొంగలు పడి బంగారం, నగదు అపహరించుకుపోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం గంగలకుర్రు మలుపు శివారు రావులమ్మ పానాటంకు చెందిన మాదే ప్రసాద్ భార్య బేబికి అనారోగ్యం కారణంగా ఆమె కుమార్తె అనిత తల్లిని గురువారం అమలాపురంలో ఓ ఆసుపత్రికి తీసుకెళ్లింది. ఆసుపత్రిలో బేబిని చికిత్స నిమిత్తం ఉంచి శుక్రవారం ఉదయం అనిత ఇంటికి వచ్చింది. ఇంటి తలుపులు తీసి ఉండడాన్ని గమనించి లోపలికి వెళ్లి చూడగా 38 గ్రాముల బంగారం, నగదు అపహరించుకుపోయిన్నట్టు గుర్తించింది. దీంతో అనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కె.చిరంజీవి పేర్కొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న

కాకినాడ ఆర్డీవోకు తీవ్ర అస్వస్థత



సామర్లకోట ఏరియా ఆసుపత్రిలో ఆర్డీవో మల్లిబాబుకు చికిత్స నిర్వహిస్తున్న వైద్యులు

ఆసుపత్రిలో చేరిక

సామర్లకోట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సామర్లకోటలో సీఎం పర్యటన ఏర్పాట్లు పర్యవేక్షిస్తూ కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు శుక్రవారం తీవ్ర అస్వస్థతకు గురవ్వడంతో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు అమల, వరలక్ష్మి, కిరణ్ ప్రాథమిక చికిత్స నిర్వహించి శ్వాస తీసుకోవడం కష్టంగా ఉండడంతో ప్రభుత్వ అంబులెన్స్‌లో కాకినాడ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సామర్లకోటలో వివిధ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్‌తో పర్యవేక్షిస్తుండగా బీపీ లెవెల్స్ పడిపోవడం, షుగర్ లెవల్స్ కూడా తగ్గడంతో కళ్లు తిరుగుతున్నట్టు సిబ్బందికి తెలియజేశారు. దీంతో సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రికి ఆర్డీవో కారులో తీసుకువెళ్లగా తీవ్ర అస్వస్థతకులోనై కుప్పకూలారు. సమాచారం తెలుసుకున్న పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప సీఎం సభా ఏర్పాట్ల నుంచి సామర్లకోట ప్రభుత్వాసుపత్రికి చేరుకుని వైద్యులతో ఆర్డీవో ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం అంబులెన్స్ వెంట కాకినాడ ఆసుపత్రికి వెళ్లి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను ఆదేశించారు. మరో 2 రోజుల వరకూ ఐసీయూలో ఉంచి చికిత్స నిర్వహించడం ద్వారా అబ్జర్వేషన్‌లో ఉంచనున్నట్టు వైద్యులు తెలిపారు.

‘స్వీట్’ విష్!

మామిడికుదురు (ఆంధ్రజ్యోతి)

సినీ నటుడు చిరంజీవి 70వ పుట్టినరోజు సందర్భంగా కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లిలో 140 కిలోలు గల 70 రకాల స్వీట్లతో మెగాస్టార్ అని రాసి అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు.



రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌కు కృష్ణకార్తీక్

మలికిపురం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కాకినాడలో ప్రభుత్వం శుక్రవారం నిర్వహించిన శాప్‌గేమ్స్‌లో ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ బ్యాడ్మింటన్ సింగిల్స్ టోర్నమెంట్‌లో మలికిపురం శ్రీరామ అకాడమీకి చెందిన ముప్పర్తి కృష్ణకార్తీక్ మొదటి స్థానంలో నిలిచాడు. తిరుపతిలోజరిగే రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నట్టు తెలిపారు.

గాజుల గౌరీదేవిగా అలంకారం

అమలాపురం టౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): అమలాపురం గ్రామదేవత శ్రీసుబ్బాలమ్మతల్లి శుక్రవారం గాజులగౌరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శ్రావణమాసం చివరి శుక్రవారం కావడంతో దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో వందలాది మంది మహిళలు సామూహిక వరలక్ష్మీవ్రతాలు, కుంకుమ పూజలు నిర్వహించారు.

కొనసాగుతోన్న వరద ఉధృతి

- లంకల్లోకి చేరుతున్న వరద
- ఇళ్లను చుట్టుముట్టిన నీరు
- వాణిజ్య పంటలు మునక





రాజోలు: నీట మునిగిన సోంపల్లి పుష్కరాల రేవు, అయినవిల్లిలంక కాజ్‌వే వద్ద పడవలపై ప్రయాణం, మలికిపురం: రామరాజులంకలో వరద నీటిలో వరి చేలు

ముమ్మిడివరం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): గోదావరి ఎగువన ధవళేశ్వరం వద్ద వరద ఉధృతంగా ప్రవహించడంతో దిగువన ఉన్న ముమ్మిడివరం మండలంలోని లంక గ్రామాలను వరద నీరు ముంచెత్తుతుంది. లంక గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు వరదనీట మునిగాయి. గురజాపులంక, లంకాఫ్ గేదెల్లంక, కూనాలంక, ఠాణేలంక, చింతపల్లిలంక తదితర ప్రాంతాల్లోని లంక గ్రామాల్లోని అంతర్గత రోడ్లు, లోతట్టు ప్రాంతాలు వరద నీటిలో మునిగాయి. వివేకానంద వారధి నుంచి గురజాపులంక వెళ్లే సీసీ రోడ్డు కూనాలంక నుంచి గురజాపులంక వరకు వరద నీట మునిగింది. దీంతో రెవెన్యూ అధికారులు రోడ్డుకు ఇరుపక్కలా ఎరుపు జెండాలను పాతారు. కూనాలంక రామాలయం వద్ద వరదనీరు రోడ్డుపై ప్రవహిస్తుంది. లంక గ్రామాల్లో సాగు చేసిన వంగ, బీర, బెండ, ఆనబ, మునగ వంటి కూరపాదులు వరదనీట మునిగాయి. దీంతో కూరగాయ పంటను ఒబ్బిడి చేసుకునే ప్రయత్నంలో రైతులు నిమగ్నమయ్యారు. గేదెల్లంక ఉత్తరవాహిని పుష్కరఘాట్‌కు వెళ్లే రోడ్డు నీట మునిగింది. లంకాఫ్ గేదెల్లంకలో లోతట్టు ప్రాంతాలు వరద నీట మునిగాయి. వరదల కారణంగా గురజాపులంకలోని, కూనాలంకలోని ఎలిమెంటరీ పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. రైతులు పొలాలకు వెళ్లేందుకు గురజాపులంకలో ఒకటి, లంకాఫ్ ఠాణేలంకలో ఒకటి మెకనైజ్డ్ బోట్లు ఏర్పాటు చేశారు. కూనాలంకలో మంచినీటిని సరఫరా చేశారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారి ఎస్.మధుసూదన్, మండల ప్రత్యేకాధికారి బి.గౌతమ్, తహశీల్దార్ టి.సుబ్బాష్, ఎంపీడీవో తాడి శ్రీవెంకటచార్యులు లంక గ్రామాల్లో పర్యటించి మండలస్థాయి అధికారులకు సూచనలిచ్చారు. మండలస్థాయి అధికారులు, పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు స్థానికంగా ఉండి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూము కొనసాగుతుంది.

నీట మునిగిన అప్పనపల్లి కాజ్‌వే

మామిడికుదురు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): గోదావరికి వరద తీవ్రత క్రమేణా పెరుగుతుండడంతో లంక గ్రామాలు జలదిగ్బంధంలోకి వెళ్లాయి. అప్పనపల్లి కాజ్‌వేపైకి వరదనీరు చేరడంతో లంక గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బాలబాలాజీ దర్శనానికి వెళ్లే భక్తులు ఇబ్బందులు పడుతూ మామిడికుదురు నుంచి ఉచ్చులవారిపేట మీదుగా దేవస్థానానికి చేరుకుంటున్నారు. అప్పనపల్లి కాజ్‌వే మునగడంతో అధికారులు రాకపోకలు నిలిపివేయడంతో బి.దొడ్డవరం, పెదపట్నంలంక, అప్పనపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాశర్లపూడి, పెదపట్నం, పాశర్లపూడిలంక గ్రామాల్లోని మత్స్యకార కాలనీల్లో వరద నీరు చేరడంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పెదపట్నం నుంచి పెదపట్నం మధ్యలంకకు వెళ్లే మార్గాన్ని వరద పోటెత్తడంతో రైతులు ఇంజను పడవలపై మధ్యలంకకు వెళ్లి పశుగ్రాసాన్ని అష్ట కష్టాల మధ్య తెచ్చుకుంటున్నారు. ఆయా లంక గ్రామాల్లోని కూరగాయపంటలు వరద నీట నానుతున్నాయి. పాశర్లపూడి బాడవలోని కనకదుర్గమ్మవారి ఆలయం వరదనీట మునిగింది. శ్రీరాంపేట, పల్లవపాలెం తదితర ప్రాంతాలు వరద నీట నానుతున్నాయి. భద్రాచలంలో వరద తగ్గుముఖం పట్టడంతో లంక గ్రామాల ప్రజలు కొద్దిగా ఊపిరి పీల్చుకుంటున్నారు. ఇంకో రెండు రోజులు వరద తీవ్రత కొనసాగుతుందని లంక గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

లంకల్లో పడవలపై ప్రయాణం

పి.గన్నవరం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): గోదావరికి ఎగువన వరదనీరు తుగ్గుతున్నప్పటికి దిగువన ఇంకా...పెరుగుతుంది. దిగువన నదీపాయలు ప్రమాదకరంగా ప్రవహించడంతో లంకగ్రామాల్లోకి వరదనీరు నెమ్మదిగా వచ్చి చేరుతుంది. మండలంలోని బూరుగులంక నదీపాయ ఉధృతంగా ప్రవహించడంతో హైలాండ్‌పై ఉన్న ఉడిమూడిలంక, పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలు, రైతులు, విద్యార్థులు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నారు. వరద నీరు ఏటిగట్టును తాకుతూ చెంతనే ఉన్న మినీ కాజ్ వేపైకి చేరడంతో పడవపై దాటడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కనకాయలంకకాజ్‌వే పూర్తి జలదిబ్బంధంలో ఉండటంతో లంక గ్రామంలోని ప్రజలు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ ఉత్పత్తులను పడవలపై ఇవతలి ఒడ్డుకు చేర్చు కుంటున్నారు. పల్లిపాలెంలో నెమ్మదిగా ఇళ్ల వద్దకు నీరు చేరుకుంటుంది. నాగుల్లంకం దిగు వన సీసీ రోడ్డు నీట మునగడంతో సమీప రాయిలంక, అయోధ్యలంక గ్రామాలకు వెళ్లే ప్రజలు నాటుపడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. నాగుల్లంక శివారు గుడ్డాయిలంకలో పంట పొలాలను వరద చుట్టిముట్టి నివాసగృహాలు వైపు పరుగులు తీస్తోంది. కె.ఏనుగుపల్లిలో ఇళ్ల స్థలాల్లోకి ప్రవేశించిన వరద నీరు రైతుసేవాకేంద్రం, అంగన్వాడీ కేంద్రాలను చుట్టిముట్టింది. పశ్చిమగోదావరి జిల్లా అనగార్లంక, పెదమల్లంక,అయోధ్యలంక గ్రామస్తులు నాటుపడవలపై రాకపోకలు సాగిస్తున్నారు.

లంక గ్రామాలకు చేరిన వరద నీరు

అంతర్వేది, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): అప్పనరామునిలంక, టేకిశెట్టి పాలెం గ్రామాలకు శుక్రవారం ఉదయం వరద నీరు చేరింది. ప్రధానంగా లాకీపేట, సఖినేటిపల్లి తదితర లంక గ్రామాలకు వరదనీరు చేరి బాడిరేవు వంతెన నీట మునిగింది. లాకులు పాడవ్వడంతో వరదనీరు కాల్వలోకి చొచ్చుకు వస్తోంది. లంక గ్రామస్తులు పశువుల కోసం దాచుకున్న గడ్డిమేట్లు, పశువులను మెరక ప్రాంతాలకు తరలిస్తున్నారు. టేకిశెట్టి పాలెం, అప్పనరామునిలంక వరద పరిస్థితిని మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు నాయకులతో కలిసి పరిశీలించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మాలే శ్రీనివాసనగేష్, తహశీల్దార్ వెం.వెంకటేశ్వరరావు, ఎంపీడీవో కె.సూర్యనారాయణ, వైద్యసిబ్బంది, వివిధ శాఖల అధికారులు వరదసహాయక చర్యల్లో పాల్గొన్నారు.

ఉధృతంగా గోదావరి

అయినవిల్లి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో వర్షాలతో గోదావరి నదికి ఉధృతంగా ప్రవహిస్తోంది. గౌతమీ, వృద్ధగౌతమీ నదులు పోటెత్తాయి. లంక గ్రామాలను వరద నీరు చుట్టుముట్టింది. అయినవిల్లిలంక కాజ్‌వేపైకి వరద నీరు రావడంతో ప్రజలు పడవలపై ప్రయాణిస్తున్నారు. పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అయినవిల్లిలంక వద్ద కాజ్‌వే ప్రాంతాన్ని సందర్శించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, తాగునీరు, ఆహార సరఫరా సకాలంలో జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. వైద్య శిబిరాలను సందర్శించి వైద్య సేవలు పరిశీలించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, పార్టీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వరద నీటిలో వ్యవసాయ భూములు

మలికిపురం, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): వరద తీవ్రత పెరగడంతో రామరాజులంక, దిండి గ్రామాల్లో వరిచేలు వరద నీటిలో మునిగాయి. దిండిరిసార్ట్‌కు చెందిన హౌస్ బోట్లు, స్పీడు బోట్లు ఒడ్డుకు చేరాయి. దిండి,రామరాజులంకలలో వరద పరిస్థితిని తహశీల్దార్ టి.శ్రీనివాసరావు స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు.

ఇళ్ల వద్దకు వరద నీరు

రాజోలు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి భారీగా వస్తున్న వరద నీటితో రాజోలు వశిష్ట గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుంది. రాజోలు పుష్కరాలరేవు, కాటన్‌పార్కు, చిల్డ్రన్స్ పార్కు, సోంపల్లి పుష్కరాల రేవు, వరద నీట మునిగాయి. రాజోలులో నున్నవారి బాడవ, మేకలపాలెంలో ఉన్న ఏటిగట్టు పక్కన ఉన్న ఇళ్ల వద్దకు వరద నీరు చేరింది. రాజోలు నున్నవారిబాడవ, మేకలపాలెం, సోంపల్లి, పొదలాడలో ప్రత్యేకాధికారి కృష్ణమూర్తి శుక్రవారం పర్యటించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు 20లీటర్ల వాటరు బాటిళ్లను వరద బాధితులకు సరఫరా చేశారు. ఆయన వెంట తహశీల్దార్ సీహెచ్ భాస్కర్, ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు, సెక్రటరీలు, వీఆర్వోలు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలి



వరద ప్రభావిత ప్రాంతంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే

ముమ్మిడివరం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): వరద ముంపు ప్రాంతాల్లో ప్రజలకు కనీస సౌకర్యాల కల్పన విషయంలో ఎటువంటి రాజీ లేకుండా చర్యలు చేపట్టాలని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతిని ఆదేశించారు. మండలంలో లంక ప్రాంతాలైన లంకాఫ్ ఠాణేలంక, కూనాలంక, గురజాపులంక ప్రాంతాల్లో కూటమి నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. ముంపు ప్రాంతాలను పరిశీలించి అక్కడి ప్రజల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ముంపు ప్రాంత ప్రజలకు అందించాల్సిన సహాయ సహకారాలు, చేపట్టాల్సిన చర్యలపై జాయింట్ కలెక్టర్‌కు ఆయన సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి ఎగువన వరద ఉధృతి తగ్గుముఖం పడుతున్నందున దిగువన కూడా వరద తీవ్రత తగ్గే అవకాశం ఉన్నందున లంకవాసులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. లంకాఫ్ ఠాణేలంక నుంచి గురజాపులంక వరకు వరద ముంపులో ట్రాక్టరును నడుపుకుంటూ అక్కడకు వెళ్లి బాధితులను పరామర్శించారు. బాధితులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందన్నారు. ముంపు బారిన పడిన ఉద్యాన పంటలను పరిశీలించారు. లంకభూముల కోత నివారణకు రూ.230కోట్లతో రక్షణ చర్యలకు ప్రతిపాదనలు రూపొందించామని త్వరలోనే అవి మంజూరవుతాయన్నారు. కూటమి నాయకులు గుత్తుల సాయి, గొలకోటి దొరబాబు, చెల్లి అశోక్, దొమ్మేటి రమణకుమార్, అర్థాని శ్రీనివాసరావు, కొప్పిశెట్టి కృష్ణమూర్తి, పళ్ల రాజబాబు, అబ్బిరెడ్డి సుబ్బారాయుడు, కోలా నాని, మోర్త ప్రసాద్, వడ్డి సత్యనారాయణ, నల్లా సత్యనారాయణ, బొక్కా సత్తిబాబు, బొక్కా రాంబాబుల తో పాటు ముమ్మిడివరం తహశీల్దార్ టి.సుభాష్ ఎస్ఐ డి.జ్వాలాసాగర్, ప్రత్యేకాధికారులు ఎస్.మధుసూదన్, బి.గౌతమ్ పాల్గొన్నారు.

డ్రైవర్స్, క్లీనర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ సమావేశం

అమలాపురం టౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): అమలాపురంలో డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఉత్తర కోస్తా జిల్లాల అధ్యక్షుడు ఏలేటి వాసు, భూపతిరాజు, ఆనంద్ వంటి ప్రముఖులు హాజరయ్యారు. జిల్లా శాఖ అధ్యక్షుడు మంద రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రైవేటు డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. అసోసియేషన్ తరపున ప్రమాదాలకు గురై ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న డ్రైవర్లకు ఆర్థికసాయం అందించారు. ముఖ్య అతిథిగా హాజరైన పట్టణ సీఐ పి.వీరబాబు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణలో డ్రైవర్లు కీలకంగా వ్యవహరించాలన్నారు. ఈసందర్భంగా సీఐ వీరబాబును సత్కరించారు. వాసంశెట్టి సత్యానందం, దంగేటి దుర్గాప్రసాద్, మంద దుర్గారావు, రత్నాజీ, దొరబాబు, రాఘవేందర్, వాసు, రామారావు పాల్గొన్నారు.

మెగామార్ట్ షోరూంలో చోరీ

అమలాపురం టౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): అమలాపురం ఎర్రవంతెన వద్ద మెగామార్ట్ షోరూంలో శుక్రవారం తెల్లవారుజామున దొంగలు పడి నగదుతో పాటు విలువైన వస్తువులను అపహరించుకుపోయారు. మెగామార్ట్ ప్రతినిధి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ కిశోర్‌బాబు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రూ.25వేలు నగదుతో పాటు విలువైన వస్తువులు అపహరించుకుపోయినట్టు పేర్కొన్నారు. క్లూస్‌టీమును రప్పించి ఆధారాలు సేకరించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

భయం గుప్పెట్లో లంక వాసులు

ఐ.పోలవరం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): గోదావరి వరద ప్రభావంతో లంక వాసులు భయాందోళనలకు గురవుతున్నారు. లోతట్టు ప్రాంతాలను వరదనీరు ముంచెత్తడంతో ప్రజలు హడలెత్తిపోతున్నారు. తహసీల్దార్ విజయశ్రీ శుక్రవారం వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. ఎదుర్లంక రామాలయంపేట, మురమళ్ల పుష్కరఘాట్ , కేశనకుర్రు పంచాయతీ పల్లిగూడెం, పొగాకులంక ప్రాంతాల్లో పర్యటించారు. గుత్తెనదీవి, గోగుల్లంక, జి.మూలపొలం, పల్లంకుర్రు రేవు ప్రయాణాలు నిలిపివేశారు. పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. బాహ్యప్రపంచానికి దూరంగా ఉన్నా గోగుల్లంక, భైరవలంక ప్రాంతాలకు ఇతర ప్రాంతాలతో సంబంధాలు తెగిపోయాయి.

ఆక్వా రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ఏపీ రైతు సంఘం రాష్ట్ర నాయకుడు సత్తిబాబు

అమలాపురం రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఆక్వా రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర నాయకుడు కొప్పుల సత్తిబాబు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు డిమాండ్‌చేశారు. ట్రంప్, మోదీ చేస్తున్న వ్యవసాయ ఒప్పందాలను తక్షణం రద్దు చేయాలన్నారు. అమలాపురం ప్రజా సంఘాల కార్యాలయంలో శుక్రవారం సంఘ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆక్వా ఎగుమతులపై సుంకాన్ని అమెరికా ప్రభుత్వం 50 శాతానికి పెంచడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే కేంద్ర ప్రభుత్వంతో చర్చించి ఆక్వారైతులను ఆదుకోవాలని కోరారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి పీతల రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవా పురస్కార గ్రహీతకు సన్మానం

అమలాపురం రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పాలగుమ్మి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పార్టుటైమ్ ఇన్‌స్ట్రక్టరుగా పనిచేస్తోన్న చిత్రలేఖనం ఉపాధ్యాయుడు పోలిశెట్టి నరసింహచంద్రకుమార్‌కు ఇటీవల కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ చేతులమీదుగా ఆగస్టు 15న ఉత్తమ సేవా పురస్కారం అందుకోగా అమలాపురం ఉప విద్యాశాఖ కార్యాలయంలో శుక్రవారం సన్మానోత్సవం నిర్వహించారు. చంద్రకుమార్‌ను పలువురు అభినందించారు. ఉప విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశంతో పాటు పలువురుపాల్గొన్నారు.

సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



అంతర్వేది ఆలయంలో వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్న దృశ్యం

అమలాపురం టౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ కోనసీమ జిల్లాశాఖ ఆధ్వర్యంలో అమలాపురం శివారు గాంధీనగర్ శ్రీకనకదుర్గమ్మ ఆలయం వద్ద శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు భమిడిపాటి శ్రీరామ్ ఆధ్వర్యంలో 400మంది మహిళలు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. భక్తులకు విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో లక్ష్మీదేవి రూపులు, పూజా సామగ్రిని అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆదినారాయణ, వీహెచ్‌పీ జిల్లా ఇన్‌చార్జి భమిడిపాటి లక్ష్మి, భమిడిపాటి కృష్ణమోహన్, కుడుపూడి వేణుగోపాలకృష్ణ, ఆలయ కమిటీ ప్రతినిధులు సలాది రామారావు, కె.బాబి, వడగన సత్యానందం, కుంపట్ల శ్రీనివాసరావు, అరిగెల శ్రీను, పిల్లా వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ సన్నిధిలో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఘనంగా జరిగాయి. ఐశ్వర్యంతో పాటు దీర్ఘ సుమంగళిగా ఉండాలని కోరుతూ అధిక సంఖ్యలో మహిళలు ఈవ్రతాన్ని ఆచరించారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్ఛారణల నడుమ పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ సిబ్బంది పూజకు అవసరమైన సామగ్రిని ఉచితంగా అందించారు. సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు.

అంతర్వేది, (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో చివరి శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆదిలక్ష్మీ అమ్మవారి ఆలయం వద్ద సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయం వద్దకు వచ్చిన భక్తులకు ఆలయ అధికారులు, సిబ్బంది ఉచితంగా అందించిన పూజా సామగ్రిని ఇచ్చారు. భక్తులు వరలక్ష్మీ వ్రత పూజల్లో పాల్గొన్నారు. ఆలయమంతా భక్తులతో కిటకిటలాడింది. అర్చకులు రెండు గంటల పాటు వ్రతాన్ని ఆలయ ఆచార సంప్రదాయాలతో నిర్వహించి అమ్మవారికి కుంకుమార్చనలు జరిపించారు.



మామిడికుదురు: అప్పనపల్లి ఆలయంలో వ్రతాలు ఆచరిస్తున్న మహిళలు

మెగాస్టార్ చిరంజీవి అందరివాడు: ఎమ్మెల్యే

ఘనంగా చిరు జన్మదిన వేడుకలు



అమలాపురంలో చిరంజీవి జన్మదిన వేడుకల కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం టౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మెగాస్టార్ చిరంజీవి అందరివాడుగా చిత్రసీమలో చిరస్థాయిగా నిలిచిపోతారని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. చిరంజీవి 70వ జన్మదిన వేడుకలను అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో శుక్రవారం మెగా అభిమానుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చిరంజీవి ఫ్యాన్స్ పట్టణశాఖ అధ్యక్షుడు నల్లా చిట్టిబాబు, అఖిలభారత చిరంజీవి యువత ఉపాధ్యక్షుడు యేడిద శ్రీను, నల్లా నాయుడు ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఆనందరావుతో పాటు అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ అధికారి జయవెంకటలక్ష్మి, జడ్పీ మాజీచైర్మన్ నామన రాంబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం భారీ అన్నదానం, వస్త్రదానం కార్యక్రమాలు నిర్వహించారు. చిరంజీవి పేరిట పార్కును ఏర్పాటు చేయనున్నట్టు జనసేన నేత నల్లా శ్రీధర్ ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు కల్వకొలను తాతాజీ, కంచిపల్లి అబ్బులు, లింగోలు పండు, దున్నాల దుర్గ, పిండి అమరావతి, కొప్పుల నాగమానస, పిండి రాజా, కొమ్ముల ధన్వంతరీనాయుడు, మాకిరెడ్డి పూర్ణిమ, నల్లామల్లిబాబు, శిరిగినీటి వెంకటేశ్వరరావు, మహదశ నాగేశ్వరరావు, గొర్తి పవన్ తదితరులు పాల్గొన్నారు. జన్మదిన వేడుకల కేక్‌ను ఎమ్మెల్యే కట్‌చేసి అందరికీ తినిపించారు.

అయినవిల్లి, (ఆంధ్రజ్యోతి): మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను ముక్తేశ్వరం సెంటర్‌లో శుక్రవారం నిర్వహించారు. వేడుకలకు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, జనసేన పార్టీ అమలాపురం నాయకుడు కొల్లాలను తాతాజీ ముఖ్య అతిథులుగా హాజరయ్యాదరు. ఎమ్మెల్యే కేక్ కట్‌చేసి వేడుకలు ప్రారంభించారు. అనాథ పిల్లలకు ఆహారం, బట్టలు, పుస్తకాలు పంపిణీ చేశారు. రక్తదాన శిబిరం నిర్వహించి వందలాది మంది యువత రక్తదానం చేశారు. ముక్తేశ్వరం సెంటర్ అంతటా భారీ కటౌట్లు, ఫ్లెక్సీ ఏర్పాటుచేసి పండుగ వాతావరణంలో చిరంజీవి పుట్టినరోజు వేడుకలు జరిపారు. కూటమి నాయకులు, మెగాస్టార్ అభిమానులు పాల్గొన్నారు.

పి.గన్నవరం,(ఆంధ్రజ్యోతి): చిరంజీవి కష్టపడి మెగాస్టార్‌గా ఎదిగారని, నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. స్థానిక జనసేనపార్టీ కార్యాలయంలో శుక్రవారం చిరంజీవి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. అనంతరం ఆయన కేక్‌కట్ చేశారు. పలువురు వృద్ధులు, రిక్షా కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ నామన రాంబాబు, సివిల్‌సప్లయి కార్పొరేషన్ డైరెక్టర్ మోకా ఆనందసాగర్, నగరం మార్కెట్ కమిటీ చైర్మన్ పెనుమాల లక్ష్మి, శిరిగినీడి వెంకటేశ్వరరావు, దాసరి వీరవెంకటసత్యనారాయణ, వాసంశెట్టి కుమార్, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ పాల్గొన్నారు.

25న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పర్యటన

అల్లవరం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): అమలాపురానికి ఈనెల25వ తేదీన తొలిసారిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ రానున్నారని ఆ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు యాళ్ల దొరబాబు తెలిపారు. అమలాపురం పట్టణంలో బీజేపీ కార్యకర్తలతో జరిగే శోభాయాత్రలో మాధవ్ పాల్గొంటారని, బీజేపీ పార్టీ స్తూపాన్ని ప్రారంభిస్తారన్నారు. ప్రజలతో మమేకమై సంచార జాతులకు బీజేపీ స్ఫూర్తిపై పలు సూచనలు చేస్తారన్నారు. మాధవ్ పాల్గొనే కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు అడపా శ్రీనివాసరావు, సుంకర సాయి, మండల అధ్యక్షుడు కట్టా నారాయణమూర్తి, రేకాడి వర్మ పాల్గొన్నారు.

మాధవ్ సభను జయప్రదం చేయాలి

ముమ్మిడివరం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): అమలాపురంలో ఈనెల25వ తేదీన నిర్వహిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు కర్రి చిట్టిబాబు పిలుపునిచ్చారు. సీహెచ్ గున్నేపల్లిలో గొలకోటి వెంకటరెడ్డి అధ్యక్షతన ముమ్మిడివరం నియోజకవర్గ బీజేపీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. సమావేశంలో చిట్టిబాబు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ సారథ్యంలో జరిగే సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. సభకు జన సమీకరణపై నాయకులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ సమావేశం

అంతర్వేది, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): బీజేపీ సఖినేటిపల్లి మండల పార్టీ సమావేశాన్ని పార్టీ మండలఅధ్యక్షుడు పోతురాజు సురేష్ అధ్యక్షతన గొంది గ్రామం చెంపాటి శివరామకృష్ణంరాజు గార్డెన్స్‌లో శుక్రవారం నిర్వహించారు. పార్టీ మండల ఇన్‌చార్జి చెల్లింగి త్రినాథ్ మాట్లాడుతూ ఈనెల25న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ జిల్లా పర్యటనకు విచ్చేస్తున్నారని, అమలాపురంలో జరిగే శోభాయాత్ర, చాయ్‌పే చర్చా బహిరంగ సభలో పాల్గొంటారన్నారు. మండలం నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు తరలివెళ్లి కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో చెంపాటి శివరామకృష్ణంరాజు, అడబాల రాంబాబు, పట్టాపు సూర్యప్రకాశరావు, ఇందుకూరి సుబ్బరాజు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.


పర్యావరణంపై అవగాహన ఉండాలి

మలికిపురం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ పర్యావరణంపై అవగాహన పెంచుకుని భవిష్యత్తు తరాలకు మేలు చేయాలని కోరుతూ వివేకానంద విద్యార్థులు శుక్రవారం విశ్వేశ్వరాయపురంలో ర్యాలీ నిర్వహించారు. 1ఎం, 1బి, గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో ఈవేస్ట్‌పై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. భూమిని కాపాడుకుందామని నినాదాలతో ప్లకార్డులు ప్రదర్శించారు. ఈవేస్ట్ ప్రాజెక్టు లీడర్స్ ఎన్.రోజిలిన్, పీబీ సాధిక, ప్రాజెక్టు సహాయ ఉపాధ్యాయులు, కరస్పాండెంట్ బీవీవీ వరప్రసాద్‌పాల్గొన్నారు.

అక్విడెక్టుపై జాయింట్ల మరమ్మతులకు నిధులు

పి.గన్నవరం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం అక్విడెక్ట్ వంతెనపై ఎక్స్‌పెన్షన్ జాయింట్ల ఏర్పాటుకు సీఎస్ఆర్ నిధులు రూ.49.35లక్షలు కేటాయించినట్లు ఇరిగేషన్ ఎస్ఈ కె.గోపినాథ్ తెలిపారు. కొత్త అక్విడెక్టుపై జాయింట్ల వద్ద పడిన గోతులను శుక్రవారం ఆయన పరిశీలించి అనంతరం మాట్లాడారు. జాయింట్లను పూర్తిస్థాయిలో పటిష్టపరిచేందుకు ఎక్స్‌పెన్షన్ జాయింట్లను ఏర్పాటు చేస్తామన్నారు.అక్విడెక్టుపై రూ.12లక్షలతో సోలార్ దీపాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఇరిగేషన్ ఈఈ కె.వెంకటేశ్వరావు, డీఈ ప్రసాద్‌రాజు, జేఈ రమేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు సమస్యలు రాకుండా చూడాలి



బోడసకుర్రు వరద ప్రాంతంలో ఆర్డీవో మాధవి పర్యటన

అల్లవరం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): వైనతేయ వరద బాధితులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా అధికారులు బాధ్యతగా పనిచేయాలని అమలాపురం ఆర్డీవో కె.మాధవి అన్నారు. బోడసకుర్రు పల్లిపాలెంలో వైనతేయ వరద ప్రాంతంలో శుక్రవారం ఆమె పర్యటించారు. వరద బాధితులకు తాగునీరు, విద్యుత్, శానిటేషన్ సమస్యలు రాకుండా చూడాలన్నారు. తహశీల్దార్ నరసింహారావు, పౌర సరఫరాల డిప్యూటీ తహశీల్దార్ భారతి, స్పెషల్ ఆఫీసర్ డి.రాంబాబు, డిప్యూటీ తహశీల్దార్ అడపా సుబ్రహ్మణ్యేశ్వరరావు వరద ప్రాంతాల్లో పర్యటించారు. బోడసకుర్రు పునరావాస కేంద్రం 260మంది వరద బాధితులకు భోజనాలు, 80వరద కుటుంబాలకు నీరు సరఫరా చేసినట్లు తహశీల్దార్ నరసింహారావు తెలిపారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ జి.స్వామి, సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, డిప్యూటీ ఎంపీడీవో యు.నాగేంద్ర, పంచాయతీ కార్యదర్శి బి.ఆదిశంకరం పాల్గొన్నారు.

వైసీపీ నేతలు తప్పుడు ప్రచారాలు మానుకోవాలి: చిట్టూరి



అంబాజీపేట, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం నియోజకవర్గ వైసీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, వైసీపీ నేతలు పెన్షన్లు తొలగిస్తున్నారని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, వాస్తవాలు తెలుసుకుని నేతలు మాట్లాడాలని అంబాజీపేట మార్కెట్ కమిటీ చైర్మన్ చిట్టూరి శ్రీనివాసు హితవు పలికారు. అంబాజీపేటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో తప్పుడు సదరం సర్టిఫికెట్లతో అనర్హులకు పింఛన్లు ఇచ్చారని, కూటమి ప్రభుత్వంలో అటువంటి అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా సదరం క్యాంపు ఏర్పాటు చేసి అర్హులకు పింఛన్లు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మద్దాల సుబ్బారావు, వస్కా శ్యామ్, రమేష్, శ్రీనుబాబులు పాల్గొన్నారు.

రాజోలు సీఐ నరేష్‌కుమార్ సహాయం

రాజోలు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ములికిపల్లికి చెందిన యువకుడు ఇంగువ లక్ష్మీవినయ్‌కుమార్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అతడు వైద్య ఖర్చులు చేయించుకోవడానికి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాడు. రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్ రాజోలులో వినయ్‌కుమార్ కుటుంబ సభ్యులకు రూ.10వేలు శుక్రవారం అందజేశారు. భవిష్యత్తులో కూడా ఏ అవసరం వచ్చినా సహాయం చేస్తానని సీఐ తెలిపారు.

ఎంపీటీసీ పదవికి రాజీనామా

మామిడికుదురు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పెదపట్నంలం ఎంపీటీసీ కడలి పద్మావతి తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని తూర్పుగోదావరి జిల్లాపరిషత్ కార్యాలయంలో సీఈవో లక్ష్మణరావుకు శుక్రవారం అందించినటు అధికారులు తెలిపారు. పెదపట్నంలో వైద్య ఆరోగ్యశాఖలో ఆశ వర్కరుగా ఎంపిక కావడంతో ఆమె రాజీనామా చేశారు.

అప్పనపల్లి వంతెన ఏర్పాటుకు కృషి: ఎమ్మెల్యే

మామిడికుదురు, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి కాజ్‌వే నుంచి వంతెన ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. ఎమ్మెల్యే శుక్రవారం అప్పనపల్లి కాజ్‌వే వద్ద స్థానిక నాయకులతో కలిసి వరద పరిస్థితిని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పనపల్లి వంతెనను ఏర్పాటుచేసి లంకగ్రామాల ప్రజల కష్టాలను తీర్చడానికి కృషిచేస్తానన్నారు. జాలెం శ్రీనివాసరాజా, వాసంశెట్టి కుమార్, కేఎం రజా, కొనుకు నాగరాజు, తహశీల్దార్ సునీల్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడి: ఆరుగురికి గాయాలు

ముమ్మిడివరం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): గేదెల్లంకలోపిచ్చికుక్క స్వైర విహారంచేసి ఆరుగురిని గాయపరిచింది. గత నెలలో కూడా ఆగ్రామంలో ఆరుగురిని కరిచి గాయపరిచింది. రెండు ఆవులనుకరవడంతో ఒక ఆవు కూడా చనిపోయినట్టు గ్రామస్తులు తెలిపారు. పిచ్చికుక్క స్వైర విహారంతో వృద్ధులు, మహిళలు, చిన్నారులు బయటకు రావడానికి భయపడుతున్నారు.

ఎగువ ప్రాంతాల్లో వరద తగ్గుముఖం పట్టినప్పటికీ దిగువకు వరదనీరు విడుదల చేయడంతో ఇక్కడ వరద ఉధృతి కొనసాగుతోంది. గోదావరి వరద లంక గ్రామాలను వరదనీరు ముంచెత్తుతోంది. దీంతో జలదిగ్బంధంలో లంక గ్రామాలు చిక్కుకున్నాయి. ఫలితంగా కొబ్బరితోటలతో పాటు ఇతర చెరకు, అరటి, తమలపాకు, కంద, మొక్కజొన్న వంటి అనేక ఉద్యాన పంటలన్నీ ముంపునకు గురయ్యాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు అధికారులు తరలిస్తున్నారు.

వరద గోదావరి

- జలదిగ్బంధంలో లంక గ్రామాలు
- ముంపు బారిన ఉద్యానపంటలు
- పర్యటిస్తున్న అధికారుల బృందం
- బొబ్బర్లంక బ్యారేజీ వద్ద నిలకడగా గోదావరి

ఆత్రేయపురం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి):ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక కాటన్ బ్యారేజీ వద్ద శుక్రవారం సాయంత్రం గోదావరి నిలకడగా ఉంది. బ్యారేజీ 175 గేట్లు ద్వారా దిగువకు వరద నీరు చేరుకుంది. 2వ ప్రమాద హెచ్చరిక జారీ చేశా రు. 13.57లక్షల క్యూసెక్కుల వరదనీరును సముద్రంలోకి విడుదల చేశారు. భద్రాచలం వద్ద వరద తగ్గుముఖం పట్టడంతో బొబ్బర్లంక బ్యారేజీ వద్ద 2వ ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. రాత్రికి గోదావరి వరద తగ్గుముఖం పడుతుందని ఇరిగేషన్ అధికారులు వెల్లడించారు. లంకగ్రామాల్లో రైతులను అప్రమత్తం చేశారు. నివాసప్రాంతవాసులను సురక్షిత ప్రాంతాలకు అధికారులు తరలించారు. శనివారం ఉదయానికి గోదావరి తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది.

కపిలేశ్వరపురం(ఆంధ్రజ్యోతి):గోదావరి వరద ప్రవాహం పెరగడంతో లంకగ్రామాల్లోని పల్లపుప్రాంతాలకు నీరుచేరి పలు రకాల పంటలు ముంపునకు గురయ్యాయి. దీంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. వరద ఉధృతి కారణంగా లంకగ్రామాలైన కేదార్లంక, వీధివారిలంక, నారాయణలంక, అద్దంకివారిలంక, పల్లపులంక గ్రామాల్లో శుక్రవారం తహసీల్దార్ జి.శ్రీనివాస్ ఆయా గ్రామాల ఫ్లడ్ అధికారులు, వీఆర్వోల బృందం పర్యటించింది. ఆయా గ్రామాల ప్రజల సమస్యలను తహసీల్దార్ శ్రీనివాస్ అడిగి తెలుసుకున్నారు. వరద పరిస్థితులపై ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు ఫ్లడ్ అధికారులతో సమీక్షించారు. కేదార్లంక, నారాయణలంక గ్రామాల్లో రేషన్ దుకాణాల్లో స్టాక్ పరిస్థితులను పరిశీలించారు. అలాగే కేదార్లంక, నారాయణలంక, అద్దంకివారిలంక కాజ్‌వేలను పరిశీలించి అక్కడ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. తాతపూడి, కేదార్లంక పుష్కర ఘాట్లలో వరద ప్రవాహాన్ని పరిశీలించి రెవెన్యూ, పోలీస్, పంచాయ తీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కేదార్లంకలో ఎంపీడీవో జి.రాజేంద్రప్రసాద్ వరద పరిస్థితులపై సమీక్ష చేశారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు వీధివెంకటరెడ్డి, సాకా శ్రీనివాస్, నాతి గవరయ్య, కార్యదర్శులు కె.శివచక్రవర్తి, జి.మధుసూధన్, వి.భీమశంకర్, వీఆర్‌వోలు వెంకటేశ్వరరావు, రామకృష్ణ, ఫ్లడ్ అధికారులు కె.శ్రీనివాసరావు, కె.తాతారావు, బి.రవి, పి.రజిత్‌సింగ్, ఎస్.వీరభద్రరావు, రెవె న్యూ, పంచాయతీ, పోలీస్ సిబ్బందిపాల్గొన్నారు.

లంక గ్రామాల్లో ఫ్లడ్ అధికారుల విధులు

మండలంలోని కేదార్లంక, వీధివారిలంక, నారాయణలంక, అద్దంకివారిలంక, పల్లపులంక గ్రామాల్లో వరదల ఉధృతి కారణంగా ఫ్లడ్ అధికారులు విధులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జి.రాజేంద్రప్రసాద్, తహసీల్దార్ జి.శ్రీనివాస్‌లు తెలిపారు. ఫ్లడ్ అధికారులుగా కేదార్లంకలో హౌసింగ్ కె.శ్రీనివాసరెడ్డి, వీధివారిలంకలో ఎంఈవో కె.తాతారావు, నారాయణలంకలో వ్యవసాయాధికారి బి.రవి, అద్దంకివారిలంకలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో పి.రజిత్‌సింగ్, పల్లపులంకలో ఆర్ డబ్ల్యుఎస్ ఏఈ ఎస్.వీరభద్రరాజు విధులు నిర్వహిస్తూ ప్రజలను వరదల పట్ల అప్రమత్తం చేస్తున్నట్లు వారు తెలిపారు.


కె.గంగవరం: కోటిపల్లిలో పుష్కరాల రేవును తాకిన గోదావరి వరద

గౌతమి గోదావరి వద్ద వరద ఉధృతి

రావులపాలెం(ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో వరద తగ్గుముఖం పట్టినప్పటికీ ఆ జలాలను దిగువకు విడుదల చేయడంతో ఇక్కడ వరద ఉధృతి కొనసాగుతోంది. సముద్రంలోకి వరద నీరు విడుదల చేయడంతో గౌతమి గోదావరివద్ద ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో వాణిజ్య పంటలు ముంపుబారిన పడుతున్నాయి. రావులపాలెం మండల పరిధిలోని గౌతమి, వశిష్టాయలలో వరదనీరు పోటెత్తి ప్రవహిస్తోంది. నదీ పరివాహక ప్రాంతంలోని లంక పొలాలు ముంపుబారిన పడుతున్నాయి.

'ప్రజలు అప్రమత్తంగా ఉండాలి'

కె.గంగవరం(ఆంధ్రజ్యోతి): ఏటిగట్టు పటిష్టతకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని టీడీపీ నాయకుడు వాసంశెట్టి సత్యం అన్నారు. శుక్రవారం ఆయన కూటమి నాయకు లతో కలసికోటిపల్లి, సుందరపల్లి, కూళ్ల గ్రామాల్లో గోదావరి వరద ఉధృతిని పరిశీలించారు. గోదావరి ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వానలు కారణంగా ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో ధవళేశ్వరం నుంచి అధిక క్యూసెక్కులు సముద్రంలోకి వదలడంతో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుందన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేయాలని సూచించారు. సుందరపల్లి వద్ద బలహీనంగా ఉన్న ఏటిగట్టును పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ పంపన నాగమణి, కూటమి నాయకులు రేవు శ్రీను, చిర్రా రాజ్‌కుమార్, వెంటూరు వీర్రాఘవులు చౌదరి, నేమాని సత్తిబాబు, నిడదవోలు సుబ్రహ్మణ్యం, గొడవర్తి రామకృష్ణతదితరులు పాల్గొన్నారు.


ఆత్రేయపురం: బొబ్బర్లంక వద్ద నిలకడగా ప్రవహిస్తున్న గోదావరి


రావులపాలెం గౌతమి వంతెన వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి


కె.గంగవరం: సుందరపల్లి వద్ద బలహీనంగా ఉన్న ఏటిగట్టుకు ఇసుక బస్తాలతో రక్షణ చర్యలు చేపట్టిన దృశ్యం


కపిలేశ్వరపురం: తాతపూడి పుష్కర ఘాట్ వద్ద వరద పరిస్థితిని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో విలీనం చేయాలి



కె.గంగవరం మండల పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అఖిలపక్ష నాయకులు

కె.గంగవరం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం నియోజక వర్గాన్ని కాకినాడ నియో జకవర్గంలో విలీనం చేయాలని అఖిలపక్ష నాయకులు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంవద్ద ధర్నా చేశా రు. ఈ సందర్భంగా అఖి లపక్ష జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీ నర్ మాగాపు అమ్మిరాజు, కోకన్వీనర్ బి.సిద్ధూ తదితరులు మాట్లాడుతూ రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో విలీనం చేస్తేనే నియోజకవర్గ భవిష్యత్ సాధ్యం అని అన్నారు. నియో జకవర్గాన్ని కాకి నాడ జిల్లాలో విలీనం చేయాలని నినాదాలు చేశారు. జేఏసీ ప్రతినిధులు మండల పరిషత్ అధ్యక్షులు పంపన నాగమణి, గ్రామ సర్పంచ్‌లను కలిసి నియోజక వర్గాన్ని కాకినాడ జిల్లాలో కలిపే విధంగా తీర్మానాలు చేయాలని కోరారు. జేఏసీ నాయకులు శ్రీను, విక్టర్‌నంద, బుంగరాజు, పి.రాము, భీమ శంకరం, కృష్ణరాజారెడ్డి, లెనిన్ పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం


ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

రావులపాలెం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార దిశగా చర్యలు తీసుకోవడానికే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం టీడీపీ క్యాంపు పార్టీ కార్యాలయంవద్ద శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన పాల్గొని వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి తాగునీరు, రోడ్లు, విద్యుత్, గృహనిర్మాణం, పెన్షన్లు, రేషన్ వంటి పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యలను ఆయా శాఖల అధికారుల ద్వారా వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే అన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కూటమి ప్రభుత్వం చేపట్టి అమలుచేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం టీడీపీ క్యాంపు పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళల కోసం ప్రవేశపెట్టిన స్త్రీశక్తి పథకం, అన్నదాత సుఖీభవ పథకం అమలుతీరుపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు.

దాత సహకారంతో విద్యార్థులకు రక్షిత మంచినీరు


రావులపాలెం కళాశాలలో ఏర్పాటుచేసిన మంచినీటి కుళాయిలను ప్రారంభిస్తున్న ప్రముఖ పారిశ్రామికవేత్త తిరపారెడ్డి

రావులపాలెం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు రక్షిత మంచినీరు అందించాలనే సంకల్పంతో ప్రముఖ పారిశ్రామికవేత్త మల్లిడి తిరపారెడ్డి తనతండ్రి చంటబ్బాయి జ్ఞాపకార్థం రూ.1.59లక్షలతో సుద్ధమైన తాగునీటి సౌకర్యాన్ని కల్పించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్వీ సూర్యనారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దాత మల్లిడి తిరపరెడ్డి, కళాశాల చైర్మన్ పోతంశెట్టి కనికిరెడ్డి, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డితోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. దాత సహకారంతో నాలుగు చోట్ల ఏర్పాటుచేసిన మంచినీటి కుళాయిలను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రముఖ పారిశ్రామికవేత్త మల్లిడి తిరపరెడ్డి గతంలో సొసైటీ భవనానికి స్థలం, రాష్ట్రంలోనే ఖ్యాతిగాంచిన సెయింట్ ప్రాటిక్స్‌పాఠశాలకు స్థలం ఉచితంగా అందించ డం ఆయన దాతృత్వానికి నిదర్శనమన్నారు. తిరపరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి పర్యటనకు తరలిరండి

ద్రాక్షారామ, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): ఈనెల 25న అమలాపురంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పర్యటనను విజయవంతం చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి తమలపూడి రామకృష్ణారెడ్డి కోరారు. శుక్రవారం ద్రాక్షారామలో బీజేపీ నియోజకవర్గ కార్యకర్తల సమీకరణ కార్యశాల నిర్వహించారు. రామచంద్రపురం పట్టణం, మూడుమండలాల నుంచి కార్యకర్తలు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రామచంద్రపురం బీజేపీ అధ్యక్షుడు ఆకేటి శ్రీకృష్ణ, కె.గంగవరం మండలం అధ్యక్షుడు కొప్పిశెట్టి చంద్రరావు, దునే శ్రీనివాసరావు, శివాజీ, మాధవపట్ల కృష్ణమూర్తి పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ సేవా పురస్కార గ్రహీతలకు సత్కారం

ఆలమూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఇటీవల జిల్లా ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్న ఆలమూరు ఎంపీడీవో ఎ.రాజు, మండల ఇంజనేరింగ్ అధికారి వీరభద్రరావులను శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఆలమూరు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో రాజు, ఇంజనేరింగ్ అధికారి భద్రరావు సేవలను పలువురు కొనియడారు. అనంతరం మండల ఇంజనీరింగ్ సిబ్బంది, ఈదల వీర్రాజు, కేతా రాంబాబు, సత్తిబాబుల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు ఆలమూరు విద్యార్థినుల ఎంపిక


ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థినులను అభినందిస్తున్న దృశ్యం

ఆలమూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి క్విజ్‌పోటీలకు ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థినిలు ఎంపికయ్యారు. అమలాపురంలో జరిగిన జిల్లా వైద్యఆరోగ్యశాఖ యూత్ ఫెస్ట్‌లో భాగంగా రెడ్ రిబ్బన్‌క్లబ్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్విజ్‌పోటీలు నిర్వహించారు. ఈపోటీలలో ఆలమూరు జూనియర్ కాలేజీ విద్యార్థినిలు బొక్కా యోగశ్రీవల్లి, వాసంశెట్టి సంధ్యలు ప్రథమస్థానం సాధించారు. వీరికి ప్రశంసాపత్రంతోపాటు రూ.5వేల నగదు బహుమతిని అందించారు. జిల్లాస్థాయిలో ప్రథమస్థానం సాధించిన శ్రీవల్లి, సంధ్యలను ఈనెల 26న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు ఎంపిక చేశారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వీరిని శుక్రవారం కాలేజీ ప్రిన్సిపాల్ నల్ల మిల్లిసురేష్‌రెడ్డి, నోడల్ అధికారి జ క్కంపూడి గోవిందు, సిబ్బంది అభినందించారు.


వాడపల్లి వెంకన్న ఆలయంలో వరలక్ష్మీదేవికి నిర్వహిస్తున్న పూజలు, హాజరైన మహిళలు



వైభవంగా సామూహిక వరలక్ష్మీవ్రతాలు

ఆత్రేయపురం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మీవ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే అష్టోత్తరపూజ, శ్రీలక్ష్మీ సహిత వేంకటేశ్వరస్వామి హో మం తదితర కార్యక్రమాలను పండితులు ఘనంగా నిర్వహించారు. అధికసంఖ్యలో మహిళలు తరలివచ్చి భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీవ్రతాన్ని నిర్వహించారు. దేవస్థానం మహిళలకు పూజా సామగ్రి అందజేశారు. అధిక సంఖ్యలో మహిళలు వరలక్ష్మీ వ్రత పూజా మహోత్సవంలో పాల్గొన్నారు. స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు ఏర్పాట్లు నిర్వహించారు. ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో శ్రావణమాసం ఆఖరి శుక్రవారం ఉచిత సామూహిక వరలక్ష్మీవ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలకు అమ్మవారి రూపులు, గాజులు, జాకెట్లు, కంకణాలు, పూజా సామగ్రి ఉచితంగా అందజేశారు. ఆలయ ఈవో బీహెచ్వీ రమణమూర్తి ఏర్పాట్లు నిర్వహించారు. ఆత్రేయపురం లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

విజయదుర్గా పీఠంలో శ్రావణ శుక్రవారం పూజలు

రాయవరం(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక విజయ దుర్గా పీఠంలో శ్రావణ శుక్రవారం పూజలు ఘనంగా నిర్వహించారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విజయదుర్గా అమ్మవారికి వేకువజామున వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించిన అనంతరం పువ్వులతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి లక్ష్మీ అష్టోత్తరాలతో శ్రీచక్ర కుంకుమార్చనలు, శ్రీవిజయ వేంకటేశ్వరస్వామికి తులసిదళ అర్చనలు, భవానీశంకర అష్టలింగేశ్వరస్వామికి రుద్రాభిషేకం, నీరాజన మంత్రపుష్పాలు, మహానివేదన జరిపి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పీఠాధిపతి గాడ్ ఆశీస్సులు పొందారు. విజయదుర్గా సేవాసమితి ఆధ్వర్యంలో అన్నసమారాధన జరిపారు. కార్యక్రమంలో విజయ దుర్గా సేవాసమితి ప్రతినిధులు గాదే భాస్కరనారాయణ, సత్యవెంకట కామేశ్వరి, బలిజేపల్లి రమ, పెదపాటి సత్యకనకదుర్గ, బుజ్జి, పీఆర్వో బాబి , భక్తులు పాల్గొన్నారు.

ద్రాక్షారామ(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం వెల్ల గ్రామంలో ఉన్న సోమేశ్వర, వేణుగోపాలస్వామి దేవాలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతం పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు మహిళలతో సామూహిక వరలక్ష్మీ వ్రతం పూజలు చేయించారు. ముందుగా వ్రతం ఆచరించిన మహిళలకు అమ్మవారి రూపు, పూజా సామగ్రి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అన్నం జానకి రామయ్య, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ ఈవో వై.వి.వి. సత్యనారాయణ అందజేశారు.

కె.గంగవరం(ఆంధ్రజ్యోతి): మండలంలోని పామర్రు ఉమా పార్వతీసమేత మల్లేశ్వరస్వామివారి ఆలయం, కోటిపల్లి కోటలో ధాన్యలక్ష్మీ అమ్మవారి ఆలయంలో శ్రావణమాసం చివరి శుక్రవారం భక్తులు సామూహిక వరలక్ష్మీదేవి వ్రతాలు నిర్వహించారు. పామర్రు ఆలయంలో జరిగిన వ్రతాల్లో పాల్గొన్న 108 మంది మహిళలకు నిర్వాహకులు రజత రూపులు, అమ్మవారి పటం, పూజా సామాగ్రి సమకూర్చారు. అమ్మవారిని ఎంపీపీ పం పన నాగమణి సుబ్బారావు దంపతులు, గంగవరం సొసైటీ అధ్యక్షుడు నేమాని సత్తిబాబు దంపతులు దర్శించుకుని పూజలు చేశారు.


ద్వారపూడి అయ్యప్పస్వామి ఆలయంలో వరలక్ష్మీ వ్రతాలు చేసేందుకు వస్తున్న మహిళలు

మండపేట(ఆంధ్రజ్యోతి): శ్రావణ శుక్రవారం చివరివారం కావటంతో మండపేట పట్టణంతోపాటు మండలంలో అమ్మవారి ఆలయాలు మహిళా భక్తులతో కిటకిటలాడాయి. మండపేట ఏడిద రోడ్డులోవున్న పెద్దమ్మతల్లికి భక్తులు సారె, చీరలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ద్వారపూడి అయ్యప్పస్వామివారి ఆలయ ప్రాంగణంలో వున్న కనకదుర్గ అమ్మవారి ఆలయంలో సామూహిక వరలక్ష్మీవ్రతాలు, కుంకుమ పూజలు నిర్వహించారు.

శనేశ్వరస్వామి ఆలయంలో...

కొత్తపేట(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిచెందిన మందపల్లి మందేశ్వర(శనేశ్వర)స్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం ఉచిత సామూహిక వరలక్ష్మీవ్రతాలు దేవస్థాన అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. సుమారు 400 మంది మహిళలు వ్రతంలో పాల్గొనగా వారికి దేవస్థానం అమ్మవారి రూపు, పూజా ద్రవ్యములు, జాకెట్టు, గాజులు పంపిణీ చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనరు దారపురెడ్డి సురేష్‌బాబు, మాజీ సర్పంచ్‌లు చింతం విజయకృష్ణ మోహన్, సిద్దంశెట్టి సత్యనారాయణ, చెంచయ్య పాల్గొన్నారు

కపిలేశ్వరపురం(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం ఆఖరిశుక్రవారాన్ని మండలంలోని పలుగ్రామాల్లో మహిళలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. అనంతరం అధిక సంఖ్యలో మహిళలు ఆలయాలను సందర్శించి అమ్మవార్లను దర్శించుకుని పూజలుజరిపి కోరిన కోర్కెలు తీర్చాలంటూ, దీర్ఘసుమంగళిగా వర్ధిల్లాలంటూ వేడుకున్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి విరాళం

ఆత్రేయపురం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో నూతనంగా నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి తాడేపల్లిగూడెం నందమూరుకు చెందిన వద్దిసాయి వెంకటరమణ-పద్మావతి దంపతులు రూ.50,116, రావులపాలెం మండలం వెదిరేశ్వరానికి చెందిన రావూరి వెంకట త్రిమూర్తులు-నాగమణి దంపతులు రూ.25,116 విరాళాలు సమర్పించారు. నూతనంగా నిర్మిస్తున్న పార్కింగ్ కోనేరు, నూతన క్యూలైన్లు మాడవీధులు, తదితర పనులను ఆలయ ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు పరిశీలించారు.

దోమల వ్యాప్తిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలి

రాయవరం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో దోమల వ్యాప్తిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి ఎన్.వెంకటేశ్వరరావు సూచించారు. శుక్రవారం మండలంలోని సోమేశ్వరం సబ్ సెంటర్‌ను రాయవరం పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో దోమల నివారణ చర్యలు ఏవిధంగా చేపడుతున్నారు అనే అంశాన్ని పరిశీలించి కొన్ని ప్రాంతాల్లో దోమల లార్వాను పరిశీలించి వాటిని ఏవిధంగా తొలగించాలి అనే అంశంపై సిబ్బందికి సూచనలు చేశారు. రాయవరం పీహెచ్‌సీలో ల్యాబ్‌ను పరిశీలించారు. ఈకార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు, సబ్ యూనిట్ ఆఫీసర్ పి.దీన దయాల్ బిషప్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

దొంగ ఓట్లు తొలగించాలి

- కాంగ్రెస్‌నేత కామన డిమాండ్

మండపేట, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి) దొంగ ఓట్లను తొలగించి ఒకేవ్యక్తికి ఒకేఓటు ఆధార్‌లింక్ ఆధారంగా ఇవ్వాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశంలో ప్రజాస్వామ్యంను కూటమి ప్రభుత్వం ఖూనీ చేస్తుందన్నారు. దేశంలో పలు రాష్ట్రాల్లో దొంగఓట్లతో అధికారంలోకి వచ్చిందని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ ప్రశ్నించారని కామన గుర్తుచేశారు. కామన ఆధ్వర్యంలో మండపేటలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు

రామచంద్రపురం(ద్రాక్షారామ),ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): సినీనటుడు, పద్మభూషణ్ చిరంజీవి జన్మదిన వేడుకలు శుక్రవారం రామచంద్రపురంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో రోగులకు, బాలింతలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అనంతరం రాజగోపాల్ థియేటర్ వద్ద స్టాలిన్ సినిమాను ఉచితంగాప్రదర్శించారు. కార్యక్రమంలో చిరంజీవి అభిమాన సంఘం నాయకులు తొగరుబ్రహ్మాజీ, బాబూరావు, దొడ్డ దుర్గా ప్రసాద్, అక్కిరెడ్డి శ్రీను, నల్లా బ్రదర్స్, పిట్ట నాని, పెద్దఎత్తున చిరంజీవి అభిమానులు పాల్గొన్నారు.

రావులపాలెం,(ఆంధ్రజ్యోతి): మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలను అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈతకోటలో కేక్‌ను కట్‌చేసి చిరంజీవి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. చిరంజీవి సేవాసమితి వీవీ వినాయక్ యూత్ ఆధ్వర్యంలో చాకెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.

కొత్తపేట(ఆంధ్రజ్యోతి): మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా భారీ కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కొత్తపేట ఉపసర్పంచ్ విళ్లమారుతీప్రసాద్ సూచనలు మేరకు అమలాపురం ఏరియా ఆసుపత్రిలో యెలిశెట్టి మణి అనే మహిళకు చిరు అభిమానులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో మోకా వెంకటసుబ్బారావు, నిమ్మకాయల చిన్నయ్యనాయుడు, పాలూరి జయప్రకాశ్‌నారాయణ, చోడపనీడి శ్రీనివాసరావు, గాదిదుర్గానాయుడు, రాయి దుర్గారావు, చోడపనీడి రాంబాబు, కోటిపల్లి దామోదర్, సూరిబాబు, శివ, ముద్రగడ దుర్గాప్రసాద్‌లు పాల్గొన్నారు.

ఆలమూరు(ఆంధ్రజ్యోతి): మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు వేడుకలు ఆలమూరు మండలంలో ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాలలో కేక్‌లు కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. సంధిపూడిలో చిరంజీవి అభిమాన సంఘం ఆధ్వర్యంలో భారీ కేక్‌ను కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. చొప్పెల్లలో ఆకుల నాగన్న అధ్వర్యంలో విద్యార్థులు విద్యాపరికరాలను అందజేసి స్వీట్స్ పంపిణీ చేశారు.

మండపేట(ఆంధ్రజ్యోతి): మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు వేడుకలను మెగా అభిమానులు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ఆదర్శ హెల్పింగ్‌హ్యాండ్ సంస్థ వద్ద మెగా అభిమానులు కేక్‌ను కట్ చేసి వేడుకలను జరుపుకున్నారు. అఖిలభారత చిరంజీవి యువత మండపేటశాఖ అధ్యక్షుడు కొంతం ప్రసాద్ సారథ్యంలో నిర్వహించారు. మెగా అభిమానులు బంగారు సతీష్, ఎం.వీరబాబు, వైజయంతి రాజు, దుర్గాప్రసాద్, మనోకృష్ణ నిమ్మన రమేష్ పాల్గొన్నారు.


కొత్తపేట పాతబస్టాండ్ సెంటర్లో భారీ కేక్‌కట్ చేసి చిరంజీవి పుట్టిన రోజు వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం


రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న అభిమానులు

సర్పంచ్ అంత్యక్రియల్లో మాజీ ఎమ్మెల్యే

ఆత్రేయపురం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం కట్టుంగ గ్రామసర్పంచ్ కరుటూరి బ్రహ్మాజీరావు(70) అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. శుక్రవారం జిల్లా వైసీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి బ్రహ్మాజీ మృతదేహానికి పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన అంత్యక్రియలలో ఆయన పాడె మోశారు. బ్రహ్మాజీ లేనిలోటు పార్టీకి తీరదన్నారు. గ్రామస్థులు, ప్రతిపక్ష నాయకులు అంతిమయాత్రలో పాల్గొన్నారు.